బుధవారం 04.02.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 288 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




రాష్ట్రంలో అలర్లు, అశాంతి రేకెత్తించేలా జగన్ ముఠా కుట్రలు చేస్తున్నారు.5 ఏళ్ల వైసీపీ అరాచక పాలన తర్వాత ప్రజలు ఇప్పుడు ప్రశాంతంగా జీవిస్తున్నారు. అది చూసి ఓర్వలేకపోతున్న వైసీపీ నేతలు విద్వేషాలు రెచ్చగొట్టి అశాంతిని నెలకొల్పాలని చూస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి జగన్ వైరస్‌లా మారారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

## అతి పెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా ఏపీ





- వచ్చే ఐదేళ్లలో 50 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం
- త్వరలోనే రాష్ట్రమంతటా శిక్షణా తరగతులు
- ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు
- లంబసింగిలో కుంకుమ పువ్వు సాగుకు ప్రణాళికలు
- వ్యవసాయం, అనుబంధ శాఖలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి, ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీని అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చే కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధికారులకు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు.. 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చారని అన్నారు. దీనిని సమర్థవంతగా అమలు చేస్తూ... 2030-31 నాటికి 40 లక్షల మంది రైతులు, 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సాగు చేపట్టేలా చూడాలని స్పష్టం చేశారు. వ్యవసాయం, అనుబంధ శాఖలపై అధికారులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, దీంతో రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, పంట ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల నాణ్యత తెలిసేలా సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సదుపాయం కల్పించాలన్నారు. అలాగే వ్యవసాయ విద్యార్థులు ప్రకృతి సాగు చేయడం ద్వారా దాని వల్ల వచ్చే ఫలితాలను స్వయంగా తెలుసుకునేలా చేయాలన్నారు. ప్రకృతి సాగుకు సంబంధించి ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ వంటివి ఈ ఏడాది ఏప్రిల్ కల్లా వచ్చేలా చూడాలని ఆదేశించారు. అలాగే జూన్ నాటికి రాష్ట్రమంతటా పూర్తి కావాలని ముఖ్యమంత్రి సూచించారు. సుభాష్ పాలేకర్‌తో రాష్ట్రమంతటా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సీఎం చెప్పారు. అంతర్జాతీయ, జాతీయ మార్కెట్లో ఏపీ వ్యవసాయ ఉత్పత్తుల వాటా అధికంగా ఉండేలా చూడాలన్నారు.

**ఎల్‌నీనో ఎదుర్కొనేలా ప్రణాళికలు :** రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం కారణంగా రైతులు నష్టపోకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని... వర్షాభావ పరిస్థితులు నెలకొనే ప్రాంతాల్లో సంప్రదాయ పంటల స్థానంలో ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఏఐ ఆధారిత క్రాప్ అడ్వయిజరీ 'భారత్ విస్తార్' వంటి వాటిని రాష్ట్రంలోనూ వినియోగించుకోవాలన్నారు. రాయలసీమలో ఒకప్పుడు నీటి సమస్య ఉండేది... సమర్థ నీటి నిర్వహణతో ఈ ఏడాది ఆ సమస్యను తీర్చాం... 2లో...

### భారత్-అమెరికా ట్రేడ్ డీల్...

## ఈ శతాబ్దపు అతిపెద్ద ఈవెంట్

### ప్రపంచ వేదికపై నిర్ణయాత్మక శక్తిగా భారత్ : ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్):** భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలుస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం ప్రపంచ వేదికపై భారత్‌కు పెరుగుతున్న గౌరవం, ప్రభావాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోందని తెలిపారు. మంగళవారం ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన కీలక ప్రసంగం చేశారు.

"భారత్ ఇక కేవలం ఎదుగుతున్న దేశం కాదు... ప్రపంచ వ్యవస్థను సమతుల్యంగా నడిపించే కీలక శక్తిగా మారింది. ప్రపంచ వేదికపై భారత పాత్ర బలపడటం ఈ శతాబ్దపు అతిపెద్ద మార్పు. వాణిజ్య చర్చల విషయంలో మేము సహనం, స్థిరత్వంతో వ్యవహరించాం. అదే నేడు దేశానికి లాభదాయకమైన ఒప్పందంగా మారింది" అని మోదీ చెప్పారు.

ఈ ఒప్పందంతో భారత ఎగుమతులకు కొత్త మార్కెట్లు తెరుచుకుంటాయని, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ప్రధాని తెలిపారు. పరిశ్రమలకు ఇది ఊతమిస్తుందని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

**భవిష్యత్ దిశగా బడ్జెట్ 2026 :** కేంద్ర బడ్జెట్ 2026ను రాబోయే 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించామని ప్రధాని తెలిపారు. ఈ బడ్జెట్ లక్ష్యాలు ప్రజలకు చేరవేయడంలో ఎంపీల పాత్ర కీలకమని చెప్పారు. ప్రతి గ్రామం, ప్రతి కుటుంబానికి బడ్జెట్ ప్రయోజనాలు చేరేలా పని చేయాలని ఆయన సూచించారు.

**ఎన్‌డీఏకు పెరుగుతున్న ఆదరణ :** దేశవ్యాప్తంగా అనేక చిన్న పార్టీలు ఎన్‌డీఏలో చేరుతున్నాయని ప్రధాని తెలిపారు. ప్రస్తుతం ఎన్‌డీఏతో కలిసిన పార్టీల సంఖ్య 50 శాతం దాటిందని చెప్పారు. ఇది ఎన్‌డీఏపై ప్రజల విశ్వాసాన్ని సూచిస్తోందని వ్యాఖ్యానించారు. మిగతా 2లో...


మరిన్ని కథనాలు లోపలి పేజీల్లో

### లాభాల బాట పట్టిన వైజాగ్ స్టీల్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏడాదిలో అనూహ్య ప్రగతి
- 94 శాతానికి చేరిన ప్లాంట్ కెపాసిటీ యుటిలైజేషన్
- స్టీల్ ప్లాంట్ పురోగతిని సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు





### మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు





### బీసీ హాస్టళ్ల మరమ్మతులకు రూ.20 కోట్లు





- ఉత్తర్వులు జారీచేసిన కూటమి ప్రభుత్వం
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.105 కోట్లు మంజూరు
- ఈ నిధులతో బీసీ హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధి
- బీసీ బిడ్డలకు ఆరోగ్య, ఆహార భద్రతతో కూడిన విద్యే లక్ష్యం
- నేడు సీఎం చంద్రబాబుతో బీసీ సంక్షేమ శాఖపై సమీక్ష : మంత్రి సవిత


## ఇక ఆంధ్రప్రదేశ్‌లో మోదీ మార్క్ అభివృద్ధి



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ 2026-27లో కేటాయించిన నిధులు, రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి కొత్త దిశను చూపిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పయనంలో ఒక కొత్త స్వర్ణయుగంలోకి అడుగు పెడుతోందని మాధవ్ ఉద్ఘాటించారు. కేంద్ర బడ్జెట్ 2026--27 ద్వారా రాష్ట్రానికి ప్రకటించిన చారిత్రాత్మక కేటాయింపులు "వికసిత ఆంధ్ర - వికసిత భారత్" లక్ష్యానికి దిశానిర్దేశం చేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.

విశాఖపట్నంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ఎం.ఎం.ఎన్. పరశురామరాజు అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ వృద్ధికి ఆంధ్రప్రదేశ్‌ను వ్యూహాత్మక మూలస్తంభంగా కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని స్పష్టం చేశారు. "దేశానికి మోదీ ప్రధాని అయిన తర్వాతే ఆంధ్రప్రదేశ్‌కు నిజమైన న్యాయం జరిగింది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ముగింపు పలికి, అభివృద్ధిని ప్రజల గడపకు చేరుస్తున్న నాయకుడు మోదీ" అని కొనియాడారు.

హైటెక్ ఏఐ హబ్‌ల నుంచి ధర్మవరం చేనేత మగ్గాల వరకు ఈ బడ్జెట్ రాష్ట్రంలోని ప్రతి రంగాన్నీ స్పృశిస్తోందన్నారు. అమరావతి అభివృద్ధికి 1,128.91 కోట్లు, రాజధాని ప్రాంత పట్టణాభివృద్ధికి 432.09 కోట్లు, మిగతా 2లో...

### అమెరికాతో వాణిజ్య ఒప్పందం

## ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి మైలురాయి



**అమరావతి, ( జర్నలిస్ట్ ఫైల్ ) :** భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహా పలువురు స్పందించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఒక చారిత్రక మైలురాయి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ ఒప్పందాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు ప్రధాని మోదీకి సీఎం హృదయపూర్వక అభినందనలు తెలిపారు. టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించడం ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు.

ఇది నిరంతర గ్లోబల్ వృద్ధికి దోహదపడే దూరదృష్టి నిర్ణయమని సీఎం తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ఒక గ్లోబల్ ఆర్థిక శక్తిగా తన స్థానం మరింత పటిష్ఠం చేసుకుంటుందన్నారు. ఈ ఒప్పందం భారత ఎగుమతుల పోటీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని చెప్పారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని యువత, రైతులకు విస్తృత అవకాశాలను సృష్టించనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

సుంకాలు 18 శాతం తగ్గించడం రైతులకు గొప్ప వరం: సుంకాలు తగ్గిస్తానన్న ట్రంప్ ప్రకటనపై హర్షం వ్యక్తం చేసిన ఉపముఖ్యమంత్రి పవన్, అమెరికాతో వాణిజ్య ఒప్పందం భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. అమెరికా సుంకాలు 18 శాతం తగ్గించడం రైతులకు గొప్ప వరమని పవన్‌కల్యాణ్ అన్నారు. మిగతా 2లో...

### రాయలసీమ సాగునీటి అభివృద్ధిపై చారిత్రాత్మక అడుగులు



- గత ప్రభుత్వ నిర్లక్ష్యమే రాయలసీమకు అన్యాయం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాయలసీమ ప్రాంతం సాగునీటి రంగంలో గత ఐదేళ్లుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, జగన్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల కీలక సాగునీటి ప్రాజెక్టులు నిలిచిపోయాయని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 19 నెలల వ్యవధిలోనే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు మిగతా 2లో...



### అమెరికా టారిఫ్ తగ్గింపు

## ఆక్వా రంగానికి శుభవార్త

**అమరావతి, ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అమెరికా ప్రభుత్వం భారతీయ సముద్ర ఆహార ఎగుమతులపై విధించిన టారిఫ్‌ను 25 శాతం నుంచి 8 శాతానికి తగ్గించడాన్ని స్వాగతిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, 2లో...

## తిరుమల పవిత్రతను కాపాడటమే లక్ష్యం



- శ్రీవారి ప్రసాదం నెయ్యి కల్తీని తీవ్రంగా పరిగణిస్తూ దోషులపై కఠిన చర్యలు
- స్వల్పకాలిక పరిపాలనా కమిటీని ఏర్పాటు చేసి ఈ అంశాన్ని సమగ్రంగా సమీక్షిస్తాం
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ 3 లో..

### భారత్-అమెరికా ట్రేడ్ డీల్ ప్రధాని మోదీ దూరదృష్టికి నిదర్శనం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ మరో చారిత్రాత్మక ఆర్థిక విజయాన్ని సాధించిందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ ప్రధాని మోదీ యొక్క దూరదృష్టి గల నాయకత్వానికి మరింత నిదర్శనంగా నిలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు.



అమెరికాతో చారిత్రక వాణిజ్య ఒప్పందం ద్వారా సుంకాలను 18 శాతం వరకుకు తగ్గించడం, ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య వ్యూహాత్మక బంధాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు. అలాగే, ఈ నిర్ణయం 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో మరింత పోటీ సామర్థ్యాన్ని కల్పిస్తుందని పివిఎన్ మాధవ్ తెలిపారు.

ఈ ట్రేడ్ డీల్ ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా తీరప్రాంతాలకు భారీ లాభాలను అందించనుంది. కాకినాడ నుంచి ఎగుమతి అయ్యే ఆక్వా, సముద్ర ఆహార ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు సులభంగా చేరగలవు. దీని ద్వారా వేలాది మంది మత్స్యకారులు, రొయ్యల రైతులు, ఎగుమతిదారులు ఆర్థిక భద్రతతో పాటు కొత్త అవకాశాలను పొందుతారు అని మాధవ్ పేర్కొన్నారు.

అంతేకాక, ఈ ఒప్పందం భారత ఎగుమతుల పోటీ తత్వాన్ని గణనీయంగా పెంచుతుందని, దేశ యువత, రైతులకు అ-పార అవకాశాలను సృష్టిస్తుందని చెప్పారు . మిగతా 2లో...

## క్యాన్సర్ బాధితులకు ఏటా ఉచితంగా రూ.600 కోట్ల వైద్య సేవలు

- నేడు క్యాన్సర్ డే...అందరి భాగస్వామ్యంతోనే క్యాన్సర్ కట్టడి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పిలుపు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో క్యాన్సర్ కేసుల నియంత్రణ, వైద్య సేవలు మెరుగుపరిచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రాణాంతకంగా మారిన క్యాన్సర్ మహమ్మారిపై పోరాటం చేసేందుకు అందరు కలిసి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ముందస్తు జాగ్రత్తలు, తగిన ప్రాథమిక పరిశీల ద్వారా క్యాన్సర్ వ్యాధులను ప్రారంభ దశలోని అరికట్టవచ్చునని పేర్కొన్నారు.

ఫిబ్రవరి 4వ తేదీ క్యాన్సర్ డే పురస్కరించుకొని రాష్ట్రంలో ఉన్న కేసులు, కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిరోధ చర్యలు, ప్రాథమిక పరీక్షలు, గుర్తించిన అంశాలు, తీసుకోబోతున్న చర్యల గురించి మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో వివరించారు.

**రూ.4,751కోట్ల ఖర్చు:** రాష్ట్రంలో 2007-2008నుంచి 2025-26 జనవరి 24వ తేదీ వరకు క్యాన్సర్ తో బాధపడే (6,32,426) వారికి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా ఉచితంగా అందించిన వ్యయం



రూ. 4751.82 కోట్లకు చేరుకుందని తెలిపారు ఇందులో మహిళలకు (3,99,829) ఖర్చు పెట్టిన వ్యయం రూ. 2,997 కోట్ల వరకు ఉందని చెప్పారు. 2,32,597 మంది పురుషులకు ఖర్చు పెట్టిన వ్యయం రూ. 1,754.477 కోట్ల వరకు ఉందని వివరించారు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 675.66 కోట్లను క్యాన్సర్ పీడితులకు వైద్యాన్ని అందించేందుకు ఖర్చు పెట్టినట్లు చెప్పారు. 2025-26లో జనవరి 24వ తేదీ వరకు రూ. 585.22 కోట్లును ఖర్చు పెట్టినట్లు పేర్కొన్నారు. వచ్చే నెలాఖరు నాటికి ఈ మొత్తం మరింత పెరగనుంది. క్యాన్సర్ వ్యాధులపట్ల ప్రజలకు వివిధ రూపాల్లో అవగాహన కల్పిస్తూనే ఎన్సీడీ-4.0 ద్వారా బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ లక్షణాలు కలిగిన వారిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించే ప్రక్రియను కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. అంతేకాకుండా 'పాలియేటివ్ కేర్' కింద దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ముఖ్యంగా క్యాన్సర్ పీడితులకు ఎలాంటి వైద్యాన్ని అందించాలన్న దానిపై శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించామని చెప్పారు.

**పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలులి :** దీర్ఘకాలిక వ్యాధులతో ముఖ్యంగా క్యాన్సర్ వంటి జబ్బులతో మంచానికి పరిమితమై చివరి దశలో 3 లో..

# భారత్-అమెరికా ట్రేడ్ డీల్... ఈ శతాబ్దపు అతిపెద్ద ఈవెంట్

(మొదటి పేజీ తరువాయి)

**39 దేశాలతో ఎఫ్‌టీఏలు : రిజిజు:** పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, ఇప్పటివరకు 39 అభివృద్ధి చెందిన దేశాలతో ఎఫ్‌టీఏలు పూర్తయ్యాయని తెలిపారు. తొమ్మిది కీలక వాణిజ్య ఒప్పందాలు ఇటీవలే ముగిశాయని, ఇది భారత ఆర్థిక బలాన్ని చాటే ఘట్టమని అన్నారు. భారత్‌పై పెరుగుతున్న అంతర్జాతీయ విశ్వాసానికి అమెరికాతో ఒప్పందమే నిదర్శనమని పేర్కొన్నారు.

**మోదీకి ఘన సత్కారం :** ఈ ఒప్పందం కుదిరిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి కేంద్రమంత్రులు, ఎన్‌డీఏ ఎంపీలు ఘనంగా సత్కరించారు. బీజేపీ, టీడీపీ, జేడీయూ, శివసేన, జేడీఎస్ సహా పలు పార్టీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

# మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

**అమరావతి, ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లాతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి ఈ తరహా ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఫిర్యాదులను పరిశీలించిన డిప్యూటీ సీఎం పవన్ అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు.

దీని వల్ల ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు వస్తుందన్నారు. మద్యం విక్రయాల వ్యవహారంలో దుకాణదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని వెల్లడించారు. ఎక్సైజ్ అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, అధిక ధరలకు విక్రయాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు.

# అమెరికాతో వాణిజ్య ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి మైలురాయి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అడుగులు వేస్తున్న ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం: ప్రధాని మోదీ నాయకత్వంలో అమెరికాతో వాణిజ్య ఒప్పందం భారతదేశానికి గొప్ప విజయమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మోదీ దూరదృష్టి గల నాయకత్వంలో కీలక ముందడుగు సాధించామని కొనియాడారు. అమెరికా టారిఫ్‌లను 25 శాతం నుంచి 18 శాతం సుంకాల తగ్గింపు భారత ఎగుమతులు, తయారీ రంగానికి భారీ ఊతమిచ్చే నిర్ణయమన్నారు. ఈ మార్పు ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సముద్ర ఆహార ఎగుమతులు, ఎంఎస్‌ఎంఈలు, వ్యవసాయ ఎగుమతులు, అభివృద్ధి చెందుతున్న తయారీ హబ్‌లు ప్రత్యక్షంగా లాభపడనున్నాయని పేర్కొన్నారు.

భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడనుందని అభిప్రాయపడ్డారు. ఈ కీలక ఒప్పందాన్ని సాధించిన చర్చా బృందాలకు, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖలకు, అలాగే రెండు దేశాల నాయకత్వాలకు హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ లోకేశ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

# రాయలసీమ సాగునీటి అభివృద్ధిపై చారిత్రాత్మక అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

సుమారు రూ. 8 వేల కోట్లను కేటాయించి అభివృద్ధికి బాటలు వేసిందని చెప్పారు. ఇప్పటికే దాదాపు రూ. 3,780 కోట్ల వ్యయంతో పలు కీలక ప్రాజెక్టుల పనులు పూర్తిచేసి రైతులకు సాగునీటి లాభాలు చేకూర్చినట్లు తెలిపారు.

గత ప్రభుత్వ పాలనలో రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, జలాశయాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని, మొత్తం 464 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్నప్పటికీ కేవలం 366 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ చేయడం గత పాలకుల వైఫల్యానికి నిదర్శనమన్నారు.

**ఎన్టీఆర్--చంద్రబాబు విజన్‌తోనే రాయలసీమ భవిష్యత్:** 1983లో ఎన్టీఆర్ హయాంలో రాయలసీమ కరువు సమస్యకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా ప్రారంభించిన ప్రాజెక్టులను చంద్రబాబు నాయుడు సమగ్రంగా రూపకల్పన చేసి అమలు చేశారని మంత్రి గుర్తు చేశారు. తెలుగు గంగ, హంద్రీ నీవా, గాలేరు–నగరి, వెలుగొండ రిజర్వాయర్ వంటి ప్రాజెక్టులు రాయలసీమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయన్నారు.

కృష్ణా నదీ జలాల విషయంలో రాయలసీమ హక్కులను జగన్ రెడ్డి ప్రభుత్వం తాకట్టు పెట్టిందని మంత్రి ఆరోపించారు. ట్రిబ్యునల్ అంశాల్లో నిర్లక్ష్యం వల్ల 512 టీఎంసీల నీటిని రాష్ట్రం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. జగన్ పాలనలో 102 సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేయడం, అనుమతులు లేకుండా ఎత్తిపోతల పథకాలను ప్రారంభించి తరువాత నిలిపివేయడం వల్ల వేల కోట్ల ప్రజాధనం వృథా అయ్యిందని విమర్శించారు.

2014--19లో చంద్రబాబు ప్రభుత్వం సాగునీటి రంగానికి రూ. 12,011 కోట్లను ఖర్చు చేస్తే, భారీ బడ్జెట్ ఉన్నప్పటికీ జగన్ ప్రభుత్వం రాయలసీమకు న్యాయం చేయలేదన్నారు.

ప్రతి సంవత్సరం సముద్రంలో వృథా అవుతున్న గోదావరి జలాలను మళ్లించి రాయలసీమకు శాశ్వత నీటి భద్రత కల్పించడమే చంద్రబాబు నాయుడు లక్ష్యమని మంత్రి తెలిపారు. రాయలసీమ రీడిజైన్ సాగునీటి ప్రణాళికతో భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

# భారత్-అమెరికా ట్రేడ్ డీల్ ప్రధాని మోదీ దూరదృష్టికి నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)

అలాగే, భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ, భారత్‌ను గ్లోబల్ ట్రేడ్ హబ్‌గా తీర్చిదిద్దే కీలక మైలురాయిగా ఈ ఒప్పందం నిలుస్తుందని ఆయన తెలిపారు. ఈ దేశహితమైన నిర్ణయానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ప్రధాని నరేంద్ర మోదీని హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# సెంట్రల్ టిడిపి కార్యాలయంలో వర్క్ షాప్ హాజరైన బి.మఠం మండలాధ్యక్షుడు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మంగళగిరిలోని తెలుగుదేశం సెంట్రల్ పార్టీ కార్యాలయంలో జరిగినటువంటి టిడిపి వర్క్ షాప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కి బ్రహ్మంగారి మఠం టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి హాజరయ్యారు ఆయనతో పాటు మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని మండలాలకు చెందిన తెదేపా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)



అన్ని రిజర్వాయర్లు నింపడంతో సాగునీటికి లోటు లేకుండా చేశామన్నారు. యూఎస్, ఈయూతో ట్రేడ్ ఒప్పందం నేపథ్యంలో రాష్ట్రం నుంచి రొయ్యలు, ఎండుమిర్చి, మామిడి, వరి, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులు పెంచుకునేందుకు మరింత అవకాశం కలిగిందని అధికారులు వివరించగా..., అయితే నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చూడాలని సీఎం అన్నారు.

**ఇకపై ఆక్వా సాగు నమోదు తప్పనిసరి :** ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. కల్టివేషన్, ప్రాసెసింగ్, మార్కెటింగ్... ఇలా అన్ని అంశాలు అంతర్జాతీయ స్థాయిలో కోకో సిటీలో ఉండాలన్నారు. మామిడి, కోకో, జీడిమామిడి, కొబ్బరి తోటల్లో అంతర్ పంటల సాగుకు అవకాశాలు ఉన్నాయని... రైతుల్ని ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. అ–రటి ఉత్పత్తిలో దేశంలోనే రెండో స్థానంలో ఉన్నప్పటికీ... ఎగుమతుల విషయంలో వెనకబడ్డామని, ఎగుమతులపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే, స్థానిక గిరిజనుల భాగస్వామ్యంతో పీపీపీ విధానంలో లంబసింగిలో పెద్దఎత్తున కుంకుమపువ్వు సాగుకు ముందుకొచ్చే సంస్థలకు అనుమతి ఇవ్వాలన్నారు. ఆక్వా సాగు వివరాలను రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీలకు కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్ట్‌ను రైతులకే ఇవ్వాలని సీఎం నిర్దేశించారు. వ్యవసాయం, అనుబంధం రంగాలకు సంబంధించి కేంద్ర పాలసీలకు అనుగుణంగా రాష్ట్ర పాలసీలు ఉండాలని చెప్పారు.

**పంటల ప్రాముఖ్యత తెలిసేలా ఫెస్టివల్స్ :** కుప్పంలో ఫ్లవర్ ఫెస్టివల్ నిర్వహించినట్టే మన పంటలకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో పలు ఫెస్టివల్స్ నిర్వహణకు ఆలోచన చేయాలని, దీంతో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. లాజిస్టిక్ ఖర్చులు తగ్గించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ విస్తృతం అవుతుందన్నారు. అవసరమైతే కేంద్రంతో మాట్లాడి మన వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ప్రత్యేక రైల్ బోగీలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. హార్టీకల్చర్, ఆక్వాకు ఏపీ గమ్యస్థానంగా ఉందని... ఈ పంట, శాటిలైట్ సమాచారం ద్వారా దిగుబడి అంచనా వేసి, అందుకు అనుగుణంగా మార్కెటింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఫ్రూట్ కవర్లతో మామిడికి మంచి నాణ్యత–ధర వచ్చిందని, జామ, దానిమ్మ వంటి పండ్ల తోటలకు ఈ విధానాన్ని అనుసరించేలా చూడాలని సీఎం చెప్పారు. ఫుడ్ క్లస్టర్ల వారీగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు ఎంవోయూ కుదుర్చుకున్న సంస్థలు త్వరితగతిన నెలకొల్పేలా సంప్రదింపులు జరపాలన్నారు. త్వరలో మామిడి ప్రాసెసింగ్ యజమానులతో సమావేశం నిర్వహించి, వారి సమస్యలు పరిష్కరిద్దామని సీఎం చెప్పారు.

**పీపీపీ విధానంలో ఫ్లవర్ మార్కెట్ :** మార్కెట్ యార్డులు ఉన్నచోట రైతు బజార్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట రైతు బజార్లను ఆధునీకరించాలన్నారు. విజయవాడలో పీపీపీ విధానంలో ఫ్లవర్ మార్కెట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. సమీక్షలో డిజి రైతు బజార్ యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా కూరగాయలను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసుకునే అవకాశం కలుగుతుంది. అలాగే ఫార్మ్ మిషనరీ కోసం ఏపీఏఐఎంఎస్ యాప్‌ను, కిసాన్ డ్రోన్ యాప్‌ను ప్రారంభించారు. రైతులు తమకు అవసరమైన ట్రాక్టర్లు, డ్రోన్లు, గడ్డికోత మిషన్లు, పవర్ టిల్లర్లు, బేలర్లను బుక్ చేసుకుని సేవలు పొందవచ్చు. రాష్ట్రంలో మొత్తం 9,512 యంత్రపరికరాలను ఇందుకు సిద్ధంగా ఉంచారు. ఇకపై రైతులే నేరుగా ఈ క్రాప్‌ను నమోదు చేసుకునే వెసులుబాటుపై వారికి అవగాహన కల్పించాలని, అలాగే వారి సందేహాలు నివృత్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టళ్ల మరమ్మతులకు రూ.20 కోట్లు



**అమరావతి, ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఆరోగ్య, ఆహార భద్రతతో కూడిన విద్య అందించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగా బీసీ హాస్టళ్ల మరమ్మతులకు రూ. 20 కోట్లు మంజూరు చేశామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. రాజధాని అమరావతి రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మరికొద్ది రోజుల్లో 2026–27 బడ్జెట్ ను కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన, చేపట్టబోతున్న పథకాలు, హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి నిధులు రాబట్టడంపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, 2025–26కు సంబంధించి రూ. 20 కోట్ల మేర సాస్కి నిధులను కూటమి ప్రభుత్వం మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీచేసిందన్నారు. ఈ నిధులను రాష్ట్రంలో 238 హాస్టళ్లలో మరమ్మతులకు వినియోగించనున్నట్లు తెలిపారు. రెండు నెలల కిందట రూ. 60 కోట్ల సాస్కి నిధులు విడుదల చేసిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలోనూ రూ. 25 కోట్లను హాస్టళ్ల మరమ్మతుల కోసం విడుదల చేశామని, ఇలా ఏడాదిలో రూ. 105 కోట్లను హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి వెచ్చించామన్నారు. బీసీ హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ రుచికరంగా అందించాలనే ఉద్దేశంతో ఇటీవల కుక్‌లు, కమాటీలను నియమించామన్నారు. సన్న బియ్యంతో బీసీ బిడ్డలకు రుచికరమైన భోజనం అందిస్తున్నామన్నారు. బీసీ విద్యార్థులకు ఆహార, ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**నేడు సీఎం చంద్రబాబుతో సమీక్షా సమావేశం :** రాబోయే బడ్జెట్ నేపథ్యంలో సీఎం చంద్రబాబుతో బీసీ సంక్షేమ శాఖ పరిధిలో పథకాల అమలు, అభివృద్ధి పనులపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఈ సమావేశంలో బీసీల అభ్యున్నతికి అవసరమైన నిధులు రాబట్టడానికి కృషి చేయాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో నెల రోజుల సమయం ఉందని, ఈ ఏడాది నిధుల విడుదల విషయమై సీఎం చంద్రబాబుకు వివరించాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బీసీ సంక్షేమానికి అమలు చేసిన పథకాలను, బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై తీసుకున్న చర్యలను సీఎం చంద్రబాబుకు వివరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇక ఆంధ్రప్రదేశ్‌లో మోదీ మార్క్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)



గ్రామీణ రహదారులకు 500.99 కోట్లు, పట్టణ నీటి సరఫరా–మురుగునీటి వ్యవస్థలకు 800 కోట్లు, రోడ్లు–వంతెనల పునర్నిర్మాణానికి 350 కోట్లు కేటాయించడాన్ని ఆయన ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టుకు కనీస నీటి మట్టం వరకు పూర్తి చేసేందుకు 3,320 కోట్లు మంజూరు చేయడం రాష్ట్ర జల భద్రతపై కేంద్రం నిబద్ధతకు నిదర్శనమన్నారు.

ఖనిజ సంపదతో ఉన్న రాష్ట్రానికి 'రేర్ ఎర్త్ కారిడార్లు' ఆమోదం, తూర్పు తీర పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, దుర్గాపూర్ వద్ద వ్యూహాత్మక నోడ్ ఏర్పాటు, చిన్న–మధ్య తరహా పరిశ్రమల కోసం 10,000 కోట్ల గ్రోత్ ఫండ్, కంటైనర్ తయారీ పథకం ద్వారా పోర్టు వ్యయాల తగ్గింపు వంటి చర్యలు పరిశ్రమలకు కొత్త ఊపునిస్తాయని తెలిపారు. విశాఖలో గూగుల్ ఏఐ హబ్ విస్తరణకు 2047 వరకూ పన్ను మినహాయింపులు డిజిటల్ పెట్టుబడులను ఆకర్షిస్తాయని చెప్పారు.

వ్యవసాయ రంగంలో కోనసీమ–ఉద్దానం ప్రాంతాల్లో కొబ్బరి, కోకో, జీడిమామిడి పంటలను అంతర్జాతీయ బ్రాండ్లుగా తీర్చిదిద్దే వ్యూహం రైతుల ఆదాయాన్ని పెంచుతుందని తెలిపారు. మత్స్యకార రంగానికి సుంకాల మినహాయింపులు, విదేశీ పోర్టుల్లో ఎగుమతుల గుర్తింపు, 500 జలాశయాల ఆధునీకరణతో ఆంధ్రప్రదేశ్ ప్రధాన మత్స్యకార కేంద్రంగా ఎదుగుతుందని అన్నారు. డైరీ, పౌల్ట్రీ రంగాలకు క్రెడిట్–లింక్డ్ సబ్సిడీ పథకం ద్వారా ఆధునీకరణకు మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు.

పర్యాటక రంగంలో అరకు ట్రెక్కింగ్ ట్రైల్స్, పులికాట్ పక్షి పరిశీలన కేంద్రాలు, పూర్వోదయ–ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా ఐదు ఐకానిక్ పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధి, రాష్ట్రానికి 4,000 ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపు వంటి నిర్ణయాలు ఆర్థిక చలనానికి బలం చేకూరుస్తాయని తెలిపారు. మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు (హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, చెన్నై–బెంగళూరు) ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారత రవాణా–పారిశ్రామిక కేంద్రంగా నిలబెడతాయని చెప్పారు. లఖ్పతి దీదీల ఆధారంగా కమ్యూనిటీ ఎంటర్‌ప్రైజ్ మార్ట్స్, ఆయుష్ మౌలిక వసతుల విస్తరణ, ప్రతి జిల్లాలో బాలికల హాస్టల్, సిటీ ఎకనామిక్ రీజియన్స్ విధానం ద్వారా టియర్–2, టియర్–3 నగరాల అభివృద్ధి వంటి పథకాలు సమగ్ర వృద్ధికి తోడ్పడతాయని అన్నారు. రాష్ట్రాలకు కేటాయించిన 1.4 లక్షల కోట్లలో ఆంధ్రప్రదేశ్‌కు తన వాటా లభించనుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి యు. సుజాత రాజ్, రాష్ట్ర కోశాధికారి ఎం. నాగేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ధ లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి కె. సుహాసిని ఆనంద్, మీడియా ప్యానెలిస్ట్ కె.ఎన్.పి. చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి, బడ్జెట్ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్. దానేష్, కో–కన్వీనర్ రాకేష్, జిల్లా మీడియా కన్వీనర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# చిరువ్యాపారులకు నారా లోకేష్ చేయూత



**మంగళగిరి( జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి నియోజకవర్గంలో చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తున్నారని మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ అన్నారు. మంగళవారం మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి పట్టణంలోని పలువురికి బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు బళ్లు, ట్రై సైకిల్ ను స్థానిక నాయకులు అందజేశారు. మంగళగిరి పట్టణంలోని 3వ వార్డుకు చెందిన గెడ్డం అంజమ్మ, 29వ వార్డుకు చెందిన తోట దుర్గ, 25వ వార్డుకు చెందిన ఊట్ల కుమారి, 26వ వార్డుకు చెందిన షేక్ కరీమున్ లకు టిఫిన్ బళ్లు అందజేశారు. 28వ వార్డుకు చెందిన మునిగెటి లక్ష్మి, టిడ్కోకు చెందిన టంగుటూరు సరితకు బడ్డీ కొట్లు, 20వ వార్డుకు చెందిన పల్లారపు రమణకు తోపుడు బండి, 21వ వార్డుకు చెందిన మునగాల నాగమల్లేశ్వరరావుకు ట్రై సైకిల్ అందజేశారు. తమ కుటుంబ జీవనోపాధికి అవసరమైన బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు బళ్లు, ఇస్త్రీ బళ్లు అందజేయాలని మంత్రి నారా లోకేష్‌ని కోరగా వెంటనే స్పందించిన ఆయన వెంటనే బళ్లు తయారు చేయించి నాయకుల చేతుల మీదుగా అందజేయించారు. ఈ సందర్భంగా పడవల మహేష్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎల్లప్పుడూ చేయూత అందిస్తూనే ఉంటున్నారని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఎందరో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వాసా పద్మ, షేక్ రియాజ్, అబ్దుల్ మజీద్, యుద్ధం అ–ప్పారావు, బిట్రా కోటేశ్వరరావు, తురకా వీరశేఖర్ బాబు, గంజి లక్ష్మయ్య, బట్టు చిదానంద శాస్త్రీ, షేక్ ఖాదర్ వలీ, ఊట్ల దుర్గామల్లేశ్వరి, వాకా మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల9లోగా ఇ కెవైసి చేయాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీకి ముందుగా రైతులకు ఈ నెల 9వ తేదీ లోగా ఇ కెవైసి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్, రాష్ట్ర భూ పరిపాలనా శాఖ ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి ఆదేశించారు. మంగళవారం రీ సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల రెండవ విడత పంపిణీ, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్, రాష్ట్ర భూ పరిపాలనా శాఖ ముఖ్య కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. రైతులకు ఎక్కడా ఏ సమస్య రాకుండా పాస్ పుస్తకాల పంపిణీని పూర్తిచేయాలన్నారు. ప్రతి నెల 10వ తేదీ లోగా ఇ కెవైసి ప్రక్రియ పూర్తి చేయాలని, 15వ తేదీ వరకు అన్ని పరిశీలనలు పూర్తి చేసి పంపిణీ ఏర్పాటు చేయాలని సూచించారు. రెవిన్యూ క్లినిక్ లలో వచ్చే అంశాలను స్పష్టంగా పరిశీలించి వేగంగా పరిష్కారం చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా టారిఫ్ తగ్గింపు ఆక్వా రంగానికి శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)



పాడి అభివృద్ధి మరియు మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం కింద ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల రాష్ట్రంలోని సముద్ర ఆహార ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఆక్వా రంగానికి గణనీయమైన ఉపశమనం లభిస్తుందన్నారు. గతంలో 25 శాతం టారిఫ్‌కు అదనంగా శిక్షాత్మక టారిఫ్‌లతో కలిపి మొత్తం 50--58 శాతం వరకు టారిఫ్ భారం పడటంతో, 2025 ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో అమెరికాకు భారతదేశం నుంచి జరిగే సముద్ర ఆహార ఎగుమతులు పరిమాణంలో సుమారు 15 శాతం తగ్గి 2.01 లక్షల మెట్రిక్ టన్నులకు, విలువలో 6.3 శాతం తగ్గి 1.72 బిలియన్ అమెరికన్ డాలర్లకు పడిపోయాయని గుర్తు చేశారు. ముఖ్యంగా అమెరికాకు ప్రధానంగా ఎగుమతి అయ్యే ఫ్రోజెన్ ష్రింప్ ఈ పరిస్థితి వల్ల తీవ్రంగా ప్రభావితమైందన్నారు. టారిఫ్‌ను 18 శాతానికి తగ్గించడంతో అమెరికా మార్కెట్‌లో భారతీయ సముద్ర ఆహార ఉత్పత్తుల పోటీ సామర్థ్యం గణనీయంగా మెరుగుపడిందని, నిలిచిపోయిన కొత్త ఎగుమతి ఆర్డర్లు తిరిగి ప్రారంభమవుతూ, బాండెడ్ గోదాముల్లో నిల్వ ఉన్న సరుకును విడుదల చేయడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. రాబోయే నెలల్లో అమెరికాకు సముద్ర ఆహార ఎగుమతులు 10 నుంచి 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని, 2025–26 రెండో అర్ధభాగంలో ఎగుమతులు టారిఫ్‌కు ముందు ఉన్న స్థాయికి చేరుకునే అవకాశముందని చెప్పారు. ఈ పరిణామంతో సముద్ర ఆహార ప్రాసెసింగ్ రంగంలోని లాభ మార్జిన్లు కూడా మెరుగవుతాయని, అధిక టారిఫ్ కాలంలో 5–5.5 శాతానికి తగ్గిన ప్రాసె–సర్ల మార్జిన్లు టారిఫ్ తగ్గింపు అనంతరం తిరిగి 7–8 శాతం స్థాయికి చేరే అవకాశముందన్నారు. కేంద్ర బడ్జెట్ – 2026లో సముద్ర ఆహార ప్రాసెసింగ్‌కు అవసరమైన ఇన్‌పుట్స్‌పై కల్పించిన డ్యూటీ రాయితీలు ఈ రంగానికి అదనపు మద్దతును అందించనున్నాయని తెలిపారు. అమెరికా మార్కెట్ పునరుద్ధరణతో పాటు యూరోపియన్ యూనియన్, చైనా, వియత్నాం, రష్యా, యునైటెడ్ కింగ్‌డమ్ వంటి అమెరికేతర మార్కెట్లకు భారతీయ సముద్ర ఆహార ఎగుమతులు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయని, 2025–26 ప్రారంభంలో ష్రింప్ ఎగుమతుల్లో అమెరికేతర మార్కెట్ల వాటా సుమారు 57 శాతానికి చేరడం మార్కెట్ విభిన్నీకరణకు నిదర్శనమని అన్నారు. దేశంలో సముద్ర ఆహార ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఈ టారిఫ్ తగ్గింపు వరంగా మారుతుందని, ఎగుమతుల పునరుద్ధరణతో రాష్ట్రంలోని మత్స్య, ఆక్వా రంగాల్లో రైతులు, మత్స్యకారులకు ఆదాయ స్థిరత్వం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు, స్థూల విలువ జోడింపు కూడా మెరుగుపడతాయని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. MPEDA అంచనాల ప్రకారం 2025–26 లో దేశవ్యాప్తంగా మొత్తం సముద్ర ఆహార ఎగుమతులు 14–15 లక్షల మెట్రిక్ టన్నులకు చేరే అవకాశముందని పేర్కొంటూ, మొత్తం మీద అమెరికా టారిఫ్‌ను 18 శాతానికి తగ్గించడం భారతీయ సముద్ర ఆహార ఎగుమతుల పునరుద్ధరణకు, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ సామర్థ్యాన్ని పెంపొందించడానికి మరియు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ మత్స్యరంగం స్థిరమైన అభివృద్ధికి కీలకంగా నిలుస్తుందని తెలిపారు.

# లాభాల బాట పట్టిన వైజాగ్ స్టీల్

**అమరావతి, ( జర్నలిస్ట్ ఫైల్ ) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విశాఖ ఉక్కు మళ్లీ లాభాల బాట పట్టింది. ఏడాదిన్నరలో అనూహ్య ప్రగతి సాధించిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ 2026 జనవరిలో రూ. 54 కోట్ల లాభాన్ని ఆర్జించింది. సచివాలయంలో మంగళవారం విశాఖ ఉక్కు పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సీఎండీ మనీష్ రాజ్ గుప్తా, సీఎస్ కె.విజయానంద్ సహా రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిరంతరం అందిన సహకారంతో గతంలో ఎదుర్కొన్న నష్టాల నుంచి బయటపడిన విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రస్తుతం రోజుకు 19,401 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేస్తోందని ఆ ప్లాంట్ సీఎండీ ముఖ్యమంత్రికి వివరించారు. 2024–25 రెండో త్రైమాసికంలో రోజుకు కేవలం 9,215 టన్నుల హాట్ మెటల్ ను మాత్రమే ఉత్పత్తి చేయగలిగామని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్లాస్ట్ ఫర్నేస్ లు పూర్తిగా పని చేస్తుండటంతో ఉత్పత్తి భారీగా పెరిగిందని అధికారులు సీఎంకు తెలియచేశారు. స్టీల్ ప్లాంట్ కెపాసిటీ యుటిలైజేషన్ లో రికార్డు స్థాయిలో 94 శాతానికి చేరుకుందని తెలిపారు. గత ఏడాది 45 శాతం మాత్రమే ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేయగలిగామని అన్నారు. పన్నులు, విద్యుత్ బకాయిలు, నీటి సరఫరా లాంటి వేర్వేరు అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారంతో ఆర్థికంగా నష్టాల నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల దశకు చేరుకుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ. 11,440 కోట్ల సాయంతో స్టీల్ ప్లాంట్ నిలదొక్కుకుని మంచి ఫలితాలు సాధిస్తుందని చెప్పారు. 2026 జనవరిలో రూ. 54 కోట్లు లాభాన్ని ఆర్జించగలిగామని తెలియచేశారు. ప్రస్తుతం ఆర్ఐఎన్ఎల్ కు క్రెడిట్ రేటింగ్ కూడా పెరిగినట్టు స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి అన్ని విభాగాల్లోనూ నూతన విధానాలను ప్రవేశపెట్టి స్టీల్ ప్లాంట్ ను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. కార్మికుల, ఉద్యోగులు, అధికారులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే ఈ విజయం సాధ్యం అయ్యింది అన్నారు.



## బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి కృషిచేద్దాం

- పిల్లల బంగారు భవిష్యత్తుకు చేయీచేయీ కలుపుదాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ ఫైల్)**

బాల్య వివాహ రహిత జిల్లాగా ఎన్‌టీఆర్ జిల్లాను తీర్చిదిద్ది, ఆదర్శంగా నిలపడంలో ప్రతిఒక్కరూ చేయీచేయీ కలపాలని, పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు నిబద్ధతతో కృషిచేయాల్సిన అవసరముందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. వాసవ్య మహిళా మండలి (వీఎంఎం) – బాల్య వివాహ విముక్తి రథాన్ని కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సంతకం చేసి విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా వాసవ్య మహిళా మండలి ఓ మంచి కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. వసుధైవ కుటుంబంలో భాగమైన మనందరం బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, బాల్య వివాహాలు జరక్కుండా కలిసికట్టుగా కృషిచేయాల్సి ఉందన్నారు. చట్టాలను గౌరవిస్తూ, నిబంధనలు పాటిస్తూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గళమెత్తాల్సిన అవసరముందన్నారు. ఈ ప్రచార రథం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బాల్య వివాహాల దుష్పరిణామాలు, చట్టాలుపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ (1098), ఉమెన్ హెల్ప్‌లైన్ (181) కూడా అందుబాటులో ఉన్నాయని.. ఎవరైనా ఈ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చన్నారు. ఈ ప్రచార రథం ద్వారా బాల్య వివాహాలపై అవగాహన కల్పించడంతో పాటు లక్ష మందికి పైగా ప్రజల నుంచి సంతకాలు సేకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ వాసవ్య మహిళా మండలి బృందానికి సూచించారు.కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డా. బి.కీర్తి, ప్రాజెక్టు డైరెక్టర్ రామానుజయ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి రుక్సానా సుల్తానా బేగం, డీసీపీయూ ఎం.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ క్లినిక్ అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టండి

- అర్జీదారుల సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ, ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ ఫైల్)**

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సందర్భంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ ద్వారా అందుతున్న అర్జీలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంతో కలిసి రెవెన్యూ క్లినిక్, పీజీఆర్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటి సత్వర పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. పీజీఆర్ఎస్ నాన్ రెవెన్యూ కింద మొత్తం 136 అర్జీలు రాగా వీటిలో పురపాలక శాఖకు 36, పోలీసు శాఖకు 21, పంచాయతీరాజ్‌కు 20 అర్జీలు ఉన్నాయి. డీఆర్‌డీఏకు 10, గృహ నిర్మాణానికి 6 అర్జీలు రాగా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, ఆరోగ్య శాఖకు అయిదు చొప్పున, పౌర సరఫరాలు, ఉపాధికల్పన, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌కు మూడు చొప్పున అర్జీలు వచ్చాయి. వ్యవసాయం, విద్యుత్, అడవులు, ఇరిగేషన్, మైన్స్, టూరిజం, ఖజానా శాఖలకు రెండు చొప్పున, సీపీవో, విద్య, గ్రౌండ్ వాటర్, ఐసీడీఎస్, మార్కెటింగ్, గ్రామీణ నీటి సరఫరా, నైపుణ్యాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, సాంకేతిక విద్య, గ్రంథాలయ శాఖలకు ఒకటి చొప్పున అర్జీలు ఉన్నాయి.రెవెన్యూ క్లినిక్ ద్వారా 75 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని, ఈ కార్యక్రమం అమల్లో జిల్లాను ముందు వరుసలో నిలపాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టీటీడీకి రూ.10.51 లక్షలు విరాళం



**తిరుమల, ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ ఫైల్)**

హైదరాబాద్ కు చెందిన సాయి సిద్ధార్థ్ ఎంటర్ప్రైజర్స్ సంస్థ సోమవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10.51 లక్షలు విరాళంగా అందించింది.ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం డీడీ ని అందజేశారు.

# చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ తప్పదు

- బందిపోట్ల మాదిరిగానే మా నేతలపై దాడులు
- వైయస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి హెచ్చరిక



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ ఫైల్)**

రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని, వైయస్సార్‌సీపీ నేతల ఇళ్లపై జరుగుతున్న దాడులే ఇందుకు నిదర్శనమని పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్ నివాసంపై జరిగిన పెట్రోల్ బాంబు దాడి నేపథ్యంలో, ఆయన పార్టీ నేతలతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఇటువంటి దాడులను ప్రజాస్వామ్య పద్ధతిలోనే ఎదుర్కొంటామని, అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ తప్పదని హెచ్చరించారు.ఇబ్రహీంపట్నంలో నిన్న జరిగిన దాడి పక్కా వ్యూహంతో నిర్వహించబడిందని ఆయన పేర్కొన్నారు. పెట్రోల్ బాంబులు, కర్రలతో సిద్ధంగా వచ్చి దాడి చేయడం, అదే సమయంలో పోలీసులు మౌనప్రేక్షకుల్లా వ్యవహరించడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన తమ నేతలకు అనుమతి ఇవ్వకుండా, తిరిగి బాధితులపైనే కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. గుంటూరులో అంబటి రాంబాబు ఇంటిపై జరిగిన దాడి నుంచి ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ ఇంటి దాడి వరకు, పోలీసుల వైఖరిలో స్పష్టమైన పక్షపాతం కనిపిస్తోందని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. నగరం నడిబొడ్డున, పోలీసుల సమక్షంలో ఈ తరహా దాడులు జరగడం బందిపోట్ల దాడులను తలపిస్తోందని, ఇలాంటి చర్యలకు పాల్పడేవారికి రాజకీయ పార్టీగా ఉండే అర్హత లేదని వ్యాఖ్యానించారు. ఇలాంటి అరాచకాలను తాము భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన ఆయన, ఈ ఘటనలను కోర్టులు, మీడియా, ప్రజలతో పాటు జాతీయ స్థాయిలోనూ లేవనెత్తుతామని తెలిపారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శిని కలవడంతో పాటు, జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని చెప్పారు. దాడుల ద్వారా తమ నాయకుల మనోధైర్యాన్ని చెక్కుచెదర చేయలేరని, వైయస్సార్‌సీపీ ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాస్, తోట విశ్వరూప్, కారుమూరు నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మేరుగ నాగార్జున, గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, ముదునూరి ప్రసాదరాజు, కరణం ధర్మశ్రీతో పాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

# సుస్థిర ఆర్థిక వృద్ధికి చేయూతగా ఆర్‌టీఐహెచ్

- వినూత్న ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు కృషి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ ఫైల్)**

ముఖ్యమంత్రి దార్శనికతకు ప్రతిరూపమైన ఒక కుటుంబం–ఒక పారిశ్రామికవేత్త నినాదాన్ని సాకారం చేసేందుకు రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) అడుగులు వేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఇగ్నైట్ సెల్‌లో ఆర్‌టీఐహెచ్ ఆధ్వర్యంలో మూడు స్టార్టప్‌లు, రెండు ఎంఎస్ఎంఈలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. సింటాక్స్ లెన్స్, ఈటీ ఆర్గానిక్స్ తదితర సంస్థల ఉత్పత్తులను కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించి.. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన సహాయసహకారాలను పూర్తిస్థాయిలో అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఓ చిన్న ఆలోచన సరికొత్త ఆవిష్కరణకు, ఆపై విజయవంతమైన పరిశ్రమ స్థాపనకు కారణమవుతుందని.. రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ స్టార్టప్‌లకు సరికొత్త ప్రోత్సాహమిస్తోందన్నారు. ఎనికేపాడులోని ఆర్‌టీఐహెచ్ స్పోక్ ద్వారా స్టార్టప్ లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటూ యువతను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎనిమిది వేల మందికిపైగా ఔత్సాహికులకు అవగాహన కల్పించామన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్, అగ్రిటెక్, హెల్త్ టెక్, ఫుడ్ టెక్, ఎడ్యూ టెక్ వంటి ఎమర్జింగ్ సాంకేతికతలను ప్రోత్సహించడమే కాకుండా ఆయా రంగాల్లో సుస్థిర ఉపాధి అవకాశాలను సొంతం చేసుకునేలా కృషిచేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కార్యక్రమంలో ఆర్‌టీఐహెచ్ స్పోక్ బృంద సభ్యులు సీహెచ్ శ్రీనివాస్, ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

### భావవ్యక్తీకరణ స్వేచ్ఛను

# దుర్వినియోగం చేస్తున్న మాజీ మంత్రులు

- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

**గొల్లపూడి, ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ ఫైల్)**



ప్రజాస్వామ్యంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛను మాజీ మంత్రులు దుర్వినియోగం చేస్తున్నారని, కల్తీ నెయ్యి ఉదంతాన్ని పక్కదోవ పట్టించడానికే తీవ్ర అసభ్యకర పదజాలం, జుగుప్సాకర మాటలతో కుట్రలు చేసి శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుల కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, "రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా అసభ్యకర పదజాలంతో వాడుతున్నారు. దీని కారణంగా గుంటూరు, ఇబ్రహీంపట్నంలో ఘటనలు చోటుచేసుకున్నాయి. జోగి రమేష్ కల్తీ మద్యం కేసులో అరెస్టు అయ్యి 83 రోజుల పాటు జైల్లో ఉండి తన బుద్ధి మార్చుకోలేదు. పోలీసు అధికారులపై అనుచిత వ్యాఖ్యలతో పాటు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్పై కించపరిచే విధంగా మాట్లాడాడు" అని ఆయన వివరించారు.ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు వ్యాఖ్యానంలో తెలిపారు, "ఇబ్రహీంపట్నంలో జోగి రమేష్ చెప్పిన దురలవాటులో భాగంగా 'ఏరా, పోరా' వంటి పదజాలాన్ని ఉపయోగించాడు. భారతదేశంలోని సీనియర్ రాజకీయ నాయకుల్లో చంద్రబాబు నాయుడు ఒకరు. ఏపీలో ఎక్కువకాలం పాటు సీఎంగా పనిచేశారు. కానీ జోగి రమేష్ ఈ పేరు ఉపయోగించి సవాళ్లు విసురుతూ వివాదాలను సృష్టించాడు. జోగి భాష ప్రజాస్వామ్య మనుగడకు ప్రశ్నార్థకం. ఆయన భాష వల్లనే కార్యకర్తలు అసహనానికి గురై కొందరు దాడికి ప్రయత్నించారు. పోలీసులు, కూటమి నాయకులు పెద్ద నష్టాన్ని నివారించారు" అని తెలిపారు. మంత్రివర్గంపై అణచివేతకు వ్యతిరేకంగా, వ్యక్తిగత దూషణ, బూతులు తిట్టడం వైసీపీ అధినాయకత్వం ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే స్పష్టించారు. "కూటమి ప్రభుత్వం తప్పు చేస్తే వారు ఎవరైనా సహించరు. ప్రజాస్వామ్యపరమైన విమర్శలు హుందాగా స్వీకరిస్తాము. కానీ దుర్భాషలు, దిగజారి పదజాలం వినడం అనవసరం. జోగి రమేష్ బడుగు, బలహీన వర్గాల ప్రతినిధి అని చెప్పుకుంటూ రెచ్చిపోయి మాట్లాడుతున్నాడు. తెగిడిసినోడు వీధికి పెద్ద అయితే, బరి తెగించినవాడు ఊరికి పెద్ద అయితే, ఇడిసేసినోడు జిల్లాకు పెద్ద అన్న చందంగా జోగి ప్రవర్తించాడు" అని ఆయన విమర్శించారు. మైలవరం నియోజకవర్గం 83 రోజులపాటు ప్రశాంతంగా ఉన్నాయని, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు వివరించారు. "మేము ఎన్నో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాము. ఏపీలో 175 నియోజకవర్గాల్లా ప్రతిపక్ష కార్యకలాపాలు మైలవరం నియోజకవర్గంలో జరుగుతున్నాయి. కానీ జోగి రమేష్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసి గుర్తింపు తెచ్చుకోవడానికి ప్రవర్తిస్తే, ఇక్కడ ఎవరు ఊరుకోరు" అని తెలిపారు.అంతేకాక, "జోగి రమేష్ భాష మార్చుకుని హుందాగా ప్రవర్తిస్తే మంచిది. మనం కూడా మైలవరం అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలనుకుంటున్నాం. సీఎం చంద్రబాబు నాయుడు ఈ రకమైన భాషకు అంగీకరించడం లేదు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణతో కూడిన పార్టీ" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. జోగి రమేష్ ఇకపై ఏ రోజున చంద్రబాబునాయుడు గురించి అమర్యాదగా మాట్లాడితే, అదే రోజున వారు కూడా జగన్ మోహన్ రెడ్డి గురించి అలాగే స్పందిస్తామని హెచ్చరించారు. "జోగి రమేష్ సమాజంలో భిన్నమైన అదుపుతప్పిన పదవీకాంక్షతో కూడిన వ్యక్తి. ఏ ఆపద వచ్చినా అతని నోటి దూల వల్లే. గౌరవం ఇస్తే పుచ్చుకోవాలి, నువ్వు కూడా హుందాగా ప్రవర్తించాలి" అని ఎమ్మెల్యే వివరించారు.

# రైజ్‌తో మహిళల వ్యాపార కలలకు రెక్కలు

- ప్రత్యేక కేంద్రంతో మహిళల వ్యాపార శక్తికి సరికొత్త దిశ
- నైపుణ్య శిక్షణ, వనరులను సద్వినియోగం చేసుకోండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ ఫైల్)**

రూరల్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సెంటర్ (రైజ్)తో మహిళల వ్యాపార కలలకు రెక్కలు వస్తాయని.. ఈ కేంద్రంలోని నైపుణ్య శిక్షణతో పాటు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్వయం సహాయక సంఘ మహిళలకు సూచించారు.కలెక్టర్ లక్ష్మీశ సోమవారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలోని రైజ్ కేంద్రాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. స్వయం సహాయక సంఘ మహిళలకు రైజ్ కేంద్ర సందర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన 331 మంది స్వయం సహాయక సంఘ మహిళలకు ఆంత్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈడీపీ) కింద వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్ది ఆర్థికంగా ఎదిగేందుకు చేయూతనివ్వనున్నట్లు తెలిపారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త సంకల్పాన్ని నెరవేర్చేందుకు ఈ రైజ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. మహిళలకు స్కిల్ డెవలప్మెంట్, మార్కెటింగ్, ఫైనాన్స్, సోషల్ మీడియా ప్లాట్ఫామ్ వినియోగం వంటి అంశాలలో పూర్తిస్థాయిలో శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. రైజ్ శిక్షణ కేంద్రం నిర్వహణకు మేనేజర్ ను కూడా నియమించామని సెంటర్‌లో ఇంటర్నెట్, కంప్యూటర్ల సౌకర్యం అందుబాటులో ఉన్నాయని.. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మహిళల్లో దాగివున్న సృజనాత్మక శక్తిని గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, ఏపీపీ బ్లాక్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## అమర్ బాబు అవయవదానం స్ఫూర్తిదాయకం : మంత్రి సత్యకుమార్




**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ఇంజనీరింగ్ విద్యార్థి అమర్ బాబు కుటుంబ సభ్యులను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వై సత్య కుమార్ పరామర్శించారు. ఇటీవల గుంటూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన ఇంజనీరింగ్ విద్యార్థి అమర్ బాబు అవయవాలను, కుటుంబ సభ్యులు దానం చేసిన నేపథ్యంలో, మంగళవారం తెనాలి వచ్చిన మంత్రి సత్యకుమార్, స్థానిక ఎమ్మెల్యే మంత్రి నాదెండ్ల మనోహర్ తో కలిసి, పినపాడు లోని అమర్ బాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అమర్ బాబు చిత్రపటానికి పూలమాలన్ని వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం తరఫున అమర్ బాబు కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతా మన్నారు. మంత్రుల వెంట బిజెపి నాయకులు మైలాహరికృష్ణ, జనసేన నాయకులు ఉన్నారు.

## తిరుణాళ్ళకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి



○ **క్వారీ తిరణాలపై ప్రత్యేక సమావేశం**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** క్వారీ తిరునాళ్లకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పొన్నూరు శాసన సభ్యులు ధూళిపాల నరేంద్ర కుమార్ కోరారు. మంగళవారమ ఉదయము చేబ్రోలు మండలం క్వారీ లో గల శ్రీ బాల కోటేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద మహా శివరాత్రి తిరుణాళ్ళ ఏర్పాట్లపై డివిజన్ స్థాయి అధికారులతో పొన్నూరు శాసన సభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి తెనాలి ఇంచార్జ్ సబ్ కలెక్టర్ మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సమావేశంలో శాసన సభ్యులు మాట్లాడుతూ వీలైనంత మంది సామాన్య భక్తులు స్వామి వారి దర్శనం చేసుకునేలా చూడాలన్నారు. అధికారులు పోలీస్ యంత్రాంగానికి సహకరించాలని ఎటువంటి శాంతిభద్రతలకు భంగం కలగకుండా చూడాలన్నారు. సామాన్య భక్తులు అధికంగా స్వామి దర్శనానికి వచ్చేలా అభిషేకాలను 6 నుండి 10 గంటల లోపు పూర్తి చేయాలని దేవాదాయ శాఖకు సూచించారు. అలాగే మూడు క్యూలైన్లను కాకుండా రెండు క్యూలైన్లు ఏర్పాటు చేయాలని , ఒకటి శ్రీఘ్ర దర్శనం అభిషేక దర్శనాలకు , రెండవది సామాన్య భక్తులకు కేటాయించాలన్నారు. 13, 14 మరియు 15 తేదీలలో మహా శివరాత్రి పండుగ నిర్వహించడం జరుగుతుందన్నారు. 13వ తేదీ పొంగలి పశువులను గుడి చుట్టూ తిప్పటం , 14వ తేదీ వాహనాలు , 15వ తేదీన మహా శివరాత్రి పండగ నిర్వహించడం జరుగుతుందన్నారు. వచ్చే భక్తులకు త్రాగునీరు ఏర్పాటు చేయాలని , శానిటేషన్ పక్కగా చేపట్టాలని పంచాయతీ అధికారికి సూచించారు. అలాగే మెడికల్ డిపార్ట్మెంట్ వారు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రభల వెంట ఉండి విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అక్కడే ఏర్పాటు చేసే ప్రభల దగ్గర ఎలక్ట్రీషియన్ అందుబాటులో వుంచాలన్నారు. ఆర్టీసీ వారు 23 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారని , భక్తులకు అవసరమైన బస్సులు ఏర్పాటు చేయుటకు ఆర్టీసీ వారు సిద్ధంగా ఉండాలన్నారు. బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు శాఖ 500 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారన్నారు. శివరాత్రి పండుగ డ్యూటీ చేస్తున్న ప్రభుత్వ అధికారులకు పాసులు మంజూరు చేయాలని , అలాగే పూజారులు పూజకు కావలసిన పూలను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలన్నారు. దేవాలయ పునరుద్ధరణ పనులకు ఎస్టిమేషన్స్ అందించాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించడం జరిగిందన్నారు. దేవాలయ పునరుద్ధరణ పనులకు అనువంశిక ధర్మకర్తలు , ప్రజలు సహకరించాలన్నారు. గుండవరం, గొడవర్రు గ్రామాల నుండి వచ్చే ప్రభలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. రామినేషన్ లేని పౌండేషన్ వారు భక్తులకు త్రాగునీరు , పులిహార అందిస్తారన్నారు. సమావేశం అనంతరం మహా శివరాత్రి మహోత్సవములుపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో చేబ్రోలు తహసీల్దార్ శ్రీనివాసు శర్మ , తెనాలి డిఎస్పి జనర్ధాన రావు , డివిజన్ స్థాయి అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమ టీడీపీ కార్యాలయంలో మహిళా గ్రీవెన్స్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల నుండి అర్జీలు స్వీకరించి, వెంటనే వాటిని పరిష్కరించవలసినదిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ...లి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మహిళల కోసం ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మహిళా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, గత నాలుగు నెలలుగా ఈ కార్యక్రమం కొనసాగుతూ, వచ్చిన సమస్యల్లో 80–90 శాతం వరకు పరిష్కారం అందించామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గ్రీవెన్స్‌లో చిట్టీ పాటల మోసాలు, గంజాయి వినియోగం, ఈవ్‌టీజింగ్, వీధి దీపాలు, కాంపౌండ్ వాల్ సమస్యలు వంటి పలు అంశాలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ఉపాధి కల్పన, పెన్షన్లు, ఇళ్ల స్థలాలపై వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం విధానాల ప్రకారం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే రోడ్లు, డ్రైన్ల సమస్యలపై పరిశీలించి అవసరమైన అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.

## గార్బేజ్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి : కమిషనర్ కె.మయూర్ అశోక్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ (జిటిఎస్)ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం ఏటుకూరు రోడ్ లోని జిటిఎస్ నిర్మాణ ప్రాంతం, ఎంఆర్ఎఫ్ సెంటర్, పొన్నూరు రోడ్ లోని వీధి కుక్కల కుటుంబ నియంత్రణ కేంద్రం, బుడంపాడు చెరువులను అధికారులతో కలిసి పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సేకరించే వ్యర్థాలను సమర్ధవంతంగా నిర్వహించడానికి జిటిఎస్ లు కీలకమని, అటువంటి వాటి నిర్మాణం వేగంగా జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిటిఎస్ లపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎస్ఈ ని ఆదేశించారు. ఏటుకూరు రోడ్ లోని యార్డ్ లో ఇళ్ల నుండి వచ్చే హానికర వ్యర్థాలను డిస్పోజ్ చేసే మెషిన్ కి షెడ్ ఏర్పాటు చేయాలని, వుడ్ చిపింగ్ మెషిన్ ని రన్నింగ్ లోకి తీసుకురావాలన్నారు. మెటీరియల్ రికవరీ ఫెసిలిటి సెంటర్ కి ప్రత్యేకంగా షెడ్ ఏర్పాటు చేయాలని ఈఈని ఆదేశించారు. పొన్నూరు రోడ్ లో ఏర్పాటు చేస్తున్న ఏబిసి సెంటర్ ని పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని, త్వరలో సెంటర్ ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం బుడంపాడు చెరువు వాకింగ్ ట్రాక్ ని పరిశీలించి, ట్రాక్ ని గతంలో అర్బన్ గ్రీనింగ్ కార్పొరేషన్ అభివృద్ధి చేసినట్లు తెలుసుకొని, స్థానిక ప్రజల కోరిక మేరకు ట్రాక్ ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు, గతంలో చేపట్టిన పనుల వివరాలను అందించాలని ఈఈని ఆదేశించారు.

పర్యటనలో సిపి రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, కార్పొరేటర్ దాసరి లక్ష్మీ దుర్గ, డిసిపి సూరజ్, ఈఈలు సుందర్రామిరెడ్డి, విష్ణు, వేణు, ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

○ **జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం**



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** మంగళవారం తెనాలి పట్టణంలో గల మారిస్ పేట మరియు గంగానమ్మపేటలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణసుబ్బరాయణం పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన వివిధ అంశాలపై సెక్రటరీలకు అవగాహన కల్పించారు ముఖ్యంగా ఈనెల 17వ తేదీన అన్ని పాఠశాలలలో కళాశాలలో అంగన్వాడి కేంద్రాలలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జాతీయ వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని ఇందులో ఒకటి నుంచి 19 సంవత్సరాల అందరికీ ఆల్బెండజోల్ టాబ్లెట్స్ మింగించుట ద్వారా నులిపురుగులను మన శరీరం నుంచి తొలగించవచ్చునని తద్వారా పోషక పదార్థాలు శరీరమునకు చేరి ఆరోగ్యంగా ఉండక అవకాశం కలుగుతుందని తెలిపారు ఎవరైనా ఈ మాత్రలను మ్రింగించిన ఎడల వారికి తిరిగి 24వ తారీఖున ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు ఆరోగ్య కార్యకర్తలను ఆశా కార్యకర్తలను ఉద్దేశించి రక్తహీనత విటమిన్ ఏ ద్రావణం యొక్క ప్రాముఖ్యత త్వరిత గతిన గర్భ నిర్ధారణ చేయుటకు అవసరమైన గర్భ నిర్ధారణ కిట్స్ వాటి యొక్క ప్రాముఖ్యత అందించవలసిన సేవలు గురించి వివరించారు మారిస్ పేటమెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రారంభ దశలోనే గర్భిణి స్త్రీలను నమోదు చేయుట వలన వారికి అవసరమైన అన్ని సేవలతో పాటు అవసరమైన పరీక్షలు నిర్వహించుటకు అవకాశం కలుగుతుందని ప్రమాదకరతల్లో ఉన్న గర్భిణీ స్త్రీలకు మరింత మరిగిన వైద్యం ఇచ్చి తల్లి బిడ్డ ప్రాణాలను కాపాడటానికి అవకాశం కలుగుతుందని తెలిపారు . గంగానమ్మపేట పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి మాట్లాడుతూ వివాహ వయసు గర్భిణీ స్త్రీ నమోదు వారికి ఇచ్చే సేవలు, పోషకాహారము సమతుల ఆహారం యొక్క ప్రాముఖ్యతను, గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలు ఆసుపత్రి కాన్పులు , తల్లిపాల యొక్క ప్రాముఖ్యత విషయాలను తెలిపారు.

ఈ కార్యక్రమంలో పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీ కంఠ ఉమాకాంత్ ,యుఎల్ బి ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి ఎస్ హెచ్ ఐ జి. రవికుమార్ , తిరువీధుల శివరామ ప్రసాద్, దాసరి శివ నాగమల్లేశ్వరరావు, హెల్త్ విజిటర్ సరోజినీ,మలేరియా ఫైలేరియా సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ ఫిలిం పెస్టివల్ విజేతలకు రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం ఇదే ప్రథమం

○ **మాఎపి అధ్యక్షులు దిలీప్ రాజ**



**తెనాలి(, జర్నలిస్ట్ ఫైల్):** మా ఏపీ సంస్థ సంక్రాంతి పండుగకు ముందు నిర్వహించిన రాష్ట్ర స్థాయి షార్ట్ ఫిలిం పోటీలలో విజేతలుగా నిలిచి, ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులతో పాటు, నటనా ప్రాధాన్యతకు వ్యక్తిగత బహుమతులు పొందిన ఆయా సంస్థల కాళా కారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఆహ్వానం పలకడం పట్ల మాఎపి సంస్థ వ్యవస్థాపకులు, సినీ దర్శకులు దిలీప్ రాజ, ప్రభుత్వ ఆహ్వానాన్ని స్వాగతిస్తూ హర్షం వెలిబుచ్చారు. స్థానిక సుల్తానాబాద్, ఆలపాటి నగర్ లోని మా ఏపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ద్వారా దిలీప్ రాజా వివరాలు వెల్లడించారు. రాష్ట్ర షార్ట్ ఫిలిం ఫెస్టివల్స్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించి నందుకు, ప్రభుత్వం గుర్తించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రస్థాయి షార్ట్ ఫిలిం ఫెస్టివల్స్ లో, ప్రథమ బహుమతి పొందిన, వైజాగ్ స్టీల్ ప్లాంట్ కథా వస్తువుగా, తీసిన షార్ట్ ఫిలిం మహావృక్షం ప్రథమ బహుమతి పొందగా, సింహాద్రి అప్పన్న ద్వితీయ బహుమతిని, అబద్ధం వర్సెస్ నిజం తృతీయ బహుమతిని గెలుచుకున్నాయని, ఆ విజేతలతో పాటు నటనపరంగా తమ ప్రతిభను కనబరిచిన ఉత్తమ కళాకారులను కూడా ఆహ్వానిం చారని తెలిపారు. గతంలో ఎన్నడూ ఇటువంటి అవకాశాలు షార్ట్ ఫిలిం నిర్మించిన వారికి లభించలేదని కూటమి ప్రభుత్వ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. సినిమా ఆటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆహ్వానం మేరకు రాష్ట్ర రాజధాని అమరావతిలోని సచివాలయానికి విజేతలతో కలిసి, వెళుతున్నట్లు దిలీప్ రాజా వివరించారు. మహావృక్షం షార్ట్ ఫిలిం దర్శకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్ ద్వారా ఎంతోమంది ఉపాధి అవకాశాలు పొందు తున్నారని, ఆ మహా వృక్షాన్ని నిలబెట్టుకునేందుకు ఎన్నో ఉద్యమాలు జరిగాయన్న కథాంశంతొ తీసిన షార్ట్ ఫిలింకు, మా ఏపీ సంస్థ నిర్వాహకులు దర్శకుడు దిలీప్ రాజా గుర్తించి, అవకాశం కల్పించడం ప్రభుత్వ దృష్టికి వెళ్లే అవకాశం లభించడం ఆనందంగా, ఉందన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి షార్ట్ ఫిలిం ఫెస్టివల్స్ లొ, బహుమతులు పొందిన సంస్థల కళాకారులతో దిలీప్ రాజ అమరావతి తరలివెళ్ళారు. సమావేశంలో వేమూరు విజయభాస్కర్, రాచూరు సునీత, ఉత్తమ నటి సుజిత, పవన్ శర్మ, మోహన్, ఈశ్వర్ త్రివిక్రమ్, నరేష్ ధోనె తదితర కళాకారులున్నారు.

## ముస్లిం శ్మశాన వాటికల పరిశీలన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** షబేబరాత్ (పెద్దల పండుగ) సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ముస్లిం శ్మశాన వాటికల్లో మంగళవారం ప్రార్ధనలు చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక మౌలిక సదుపాయాలు కల్పించామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. స్థానిక ఆనందపేటలోని ముస్లిం శ్మశాన వాటికను పరిశీలించి శానిటేషన్, ఇతర సదుపాయాల కల్పనపై అధికారులకు సూచనలిచ్చారు. ముస్లిం మైనారిటీలు రాత్రంగా జాగారం ఉండి ప్రత్యేక దువా చేశారు. దానధర్మాలు వంటి కార్యక్రమాలు చేపట్టి, మరణించిన తమ కుటుంబీకులు, బంధువుల ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ ప్రార్థనలు నిర్వహించే పెద్దల పండుగకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎమ్మెల్యే నసీర్ చర్యలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంలోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యమైందని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇమామ్ లు, మౌజన్లకు ఇవ్వాల్సిన వేతనాలను సైతం తాము అధికారంలోకి వచ్చాక విడుదల చేయించామని వెల్లడించారు.

## గ్యాస్ సిలిండర్ పేలి వాహనం దగ్ధం



**మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్):** మైదుకూరు పట్టణంలోని కడప రోడ్డులో ఓమ్ని వాహనంలో గ్యాస్ సిలిండర్ పేలి పూర్తిగా దగ్ధమైపోయింది. వివరాల్లోకి వెళితే వాహనానికి గ్యాస్ నింపే క్రమంలో ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాద సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు స్వల్పంగా దెబ్బతిని తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో విద్యుత్ వైర్లు సైతం కాలి కిందపడ్డాయి. ఈ సంఘటనతో స్థానికులు పూర్తిగా భయాందోళనకు గురై ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి అదుపు చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుడివాడ గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాలను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పంపిణీ చేశారు. క్యూఆర్ కోడ్, విశిష్ట సంఖ్యతో ఉన్న, భూమి వివరాలతో కూడిన రాజ ముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను తెనాలి మండలం గుడివాడ గ్రామంలో మంగళవారం జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు, భూ యజమానుల ఆస్తులకు భద్రత కల్పించేలా కొత్త టెక్నాలజీతో పట్టాదారు పాస్ పుస్తకం తయారు చేసినట్టు చెప్పారు.

గ్రామసభలు నిర్వహించి పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎక్కడా వివాదాలకు తావివ్వకుండా రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని చెప్పారు. జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకంపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే భూమి వివరాలు తెలుస్తాయని చెప్పారు. ప్రభుత్వం ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకంతో ఆస్తిపై పూర్తి భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ఇకేవైసీ పూర్తి అయ్యాకే పాస్ పుస్తకం ముద్రించి జారీ చేయడం జరిగిందన్నారు. దేశంలో ఆంధ్ర ప్రదేశ్ ఒక రోల్ మోడల్ గా రీ సర్వే ప్రాజెక్ట్ ను తీసుకువచ్చిందని, సైంటిఫిక్ గా డ్రోన్, రూటర్లతో రీ సర్వే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. గ్రామ సభలు నిర్వహించి లోపాలు సవరించి తయారు చేయడం జరిగిందని చెప్పారు. రీ సర్వే ద్వారా నిజమైన హక్కుదారుకు వారి పేరున పట్టాదారు పాసు పుస్తకాలను అందించడం జరుగుతుందన్నారు.

ఈ సందర్భంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## షేక్ జలీల్ కండిషన్ బెయిల్ రద్దు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి మండలం పెద్ద వడ్లపూడి గ్రామానికి చెందిన నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, రౌడీషీటర్ షేక్ జలీల్ ఖాన్ కండిషన్ బెయిల్ ను మంగళగిరి కోర్టు మంగళవారం రద్దు పరిచింది. మంగళగిరి మండలం చిన్న కాకాని భూ కబ్జా కేసులో గతేడాది నవంబర్లో జలీల్ పై కేసు నమోదు కాగా డిసెంబర్ రెండో తేదీన మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. 24 డిసెంబర్ నా కండిషన్ బెయిల్ పై విడుదలయ్యాడు. జలీల్ ఫిర్యాదుదారులపై బెదిరింపులకు పాల్పడటంతో పాటు, రాజకీయ దురుద్దేశంతో రెండు వర్గాల మధ్య వివాదాలు గొడవలు సృష్టించేందుకు మీడియా ముఖంగా ప్రయత్నించాడు. కండిషన్ బెయిల్ పై విడుదలైన జలీల్ ఖాన్ పై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ లో మరో కేసు నమోదయింది.

ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకొని మంగళగిరి రూరల్ పోలీస్ వారు జలీల్ కండిషన్ బెయిల్ రద్దు చేయాలని మంగళగిరి కోర్టు వారికి పిటిషన్ అందజేశారు. విచారణ చేపట్టిన మంగళగిరి కోర్టు వారు జలీల్ కండిషన్ బెయిల్ ను రద్దు పరిచారు. 14 రోజుల రిమాండ్ లో భాగంగా జలీల్ ను గుంటూరు జైలుకు తరలించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# మూలాల నుండి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది

○ **గాదె, బోనబోయిన. వెల్లడి**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారంపత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో నెయ్యి కల్తీ జరిగిన మాట వాస్తవమని, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని ఆ విషయాన్ని స్పందించాల్సినంత వరకు మాత్రమే తాము స్పందిస్తున్నామని, దీనిని ఆసరాగా చేసుకుని వైసిపి నాయకులు అసలు నెయ్యిలోనే కల్తీ జరగలేదని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. అలాగే అంబటి రాంబాబు గ విషయంలో జరిగిన సంఘటన పూర్తిగా పోలీస్ వ్యవస్థ వైఫల్యం వల్ల మాత్రమే జరిగిందని, వారు ముందుగా స్పందించి అంబటి రాంబాబు ని అటువైపు రాకుండా చేసినట్లయితే అసలు ఈ సంఘటన జరిగి ఉండేది కాదని అన్నారు. కానీ పోలీసు వ్యవస్థ అలా చేయకపోవడం వలన నేడు ప్రభుత్వం నింద మోయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ఈ విషయం మీద పూర్తిస్థాయి విచారణ జరగాలని, ఈ సంఘటన జరగకుండా చేయలేకపోయినా ప్రతి అధికారిని కూడా బాధ్యతగా చేసి వారిని విధుల నుండి తప్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. సహజంగా ఒక రాజకీయ నాయకుడిని ఏదైనా మాట అన్నప్పుడు, వారి అభిమానులు ఆ క్షణంలో ఆవేశపడతారని, ఆ ఆవేశాన్ని ముందుగా పసిగట్టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాల్సిన బాధ్యత పోలీసు వ్యవస్థ మీద ఉందని అన్నారు. ఆ విషయంలో పూర్తిగా పోలీసు వ్యవస్థ విఫలమైందని, అది తన సొంత అభిప్రాయం అని వ్యక్తం చేశారు. ఈ విషయం మీద డిజిపి ని కలిసి విచారణ చేయవలసిందిగా కోరుతామని తెలియజేశారు. వైసీపీ నాయకులు ప్రతి ఒక్కరూ వచ్చి అంబటి రాంబాబు మీద దాడి జరిగిందని మాట్లాడే వారేనని, రాంబాబు గల్ మాట్లాడిన మాట తప్పని ఏ ఒక్కరు మాట్లాడట్లేదని అన్నారు. ఆయన కనీసం నోటితో చెప్పడానికి కూడా వీలులేని మాటలు మాట్లాడి, ఆయన మీద దాడి జరిగిందని చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమో ఆలోచించుకోవాలని అన్నారు. వైసీపీ వాళ్లు చేసిన తప్పు ఒప్పుకొని, న్యాయస్థానం ముందు లొంగిపోతే బాగుంటుందని అన్నారు. అలాగే పవన్ కళ్యాణ్ ఎప్పుడూ కూడా వ్యవస్థలు బ్రతకాలని, తద్వారా రాష్ట్రానికి దేశానికి మంచి జరగాలని ఆలోచించే నిస్వార్ధ నాయకుడు పవన్ కళ్యాణ్ అని అన్నారు. రాబోయే రోజుల్లో పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీని మరింత బలోపేతం తీసుకు అడుగులు వేయిస్తామని, ప్రజలంతా ఆదరించాలని అన్నారు. అలాగే ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో రాష్ట్ర అభివృద్ధిని మాత్రమే కాంక్షించి, సొంత పార్టీ ప్రయోజనాలను, తనతో నడిచిన నాయకులకు పదవుల విషయాన్ని కూడా ఆలోచించకుండా కేవలం రాష్ట్ర ప్రయోజనాల కోసం మాత్రమే కూటమి కట్టిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని అన్నారు. జనసేన పార్టీ ఎప్పుడూ కూడా రాష్ట్ర హితాన్ని మాత్రమే కోరుకుంటుందని, రాష్ట్రాల ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకునే ఏకైక పార్టీ జనసేన పార్టీ అని అన్నారు. ఇటీవల తిరపతి లడ్డు విషయంలో అసలు కల్తీనే జరగలేదని వైసిపి వాళ్ళు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, వారు ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ఎందుకంటే దేశంలోనే అత్యున్నత ప్రమాణాలు కలిగిన నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ ఇచ్చిన నివేదిక ప్రకారం, కల్తీ జరిగిన మాట ముమ్మాటికి వాస్తవం అని తెలియజేస్తుందని అన్నారు. వారు ఇచ్చిన రిపోర్టును చదివి వినిపిస్తూ కల్తీ జరిగిన విషయాన్ని సుస్పష్టం చేయడం జరిగింది. అందులో జంతువుల కొవ్వు కలిసిన విషయాన్ని ఎన్ డి ఓ బి స్పష్టంగా రాశారని రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేశారు. అలాగే అంబటి రాంబాబు మీద జరిగిన దాడి విషయంలో స్పందిస్తూ, జనసేన పార్టీ ఏ రోజు కూడా దాడులను ప్రోత్సహించదని, రాష్ట్రంలో శాంతియుతంగా ఉండే ఏకైక పార్టీ జనసేన పార్టీ అని, జన సైనికులు వీర మహిళలు పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేసేవారని అన్నారు. అలాగే కులాలను కలిపి ఆలోచన విధానం, మతాల ప్రస్తావనలేని రాజకీయం జనసేన పార్టీ సిద్ధాంతాలలోనే ఉందని అన్నారు. అంబటి రాంబాబు కుమార్తె మాట్లాడిన మాటలు పై స్పందిస్తూ మీ నాన్న కులం గురించి నేడు గుర్తొచ్చిందా, మీ నాన్న అదే కులాన్ని కించపరిచి మాట్లాడినప్పుడు మీరు ఆ విషయం మీ నాన్నకి తెలియజేయాలి కదా అని అన్నారు. అప్పుడు స్పందించకుండా ఇప్పుడు వచ్చి స్పందిస్తే ఎలాగా అని అన్నారు. అలాగే ఫ్లెక్సీల ప్రస్తావనకి వచ్చినప్పుడు తాము కేవలం సిట్ రిపోర్టులో ఏదైతే వచ్చిందో దానిని ప్రజలందరికీ తెలియజేసే ఉద్దేశంలో మాత్రమే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని, వైసిపి వాళ్ళు కల్తీ చేసిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతో మాత్రమే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన విషయాన్ని తెలియజేశారు. కానీ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వైసిపి వాళ్ళు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ ల యొక్క ఫోటోలను చూయిస్తూ, అత్యంత జుగుప్సాకరంగా, కించపరిచే విధంగా తమ నాయకుడు పవన్ కళ్యాణ్ ఫోటోలను ఏర్పాటు చేశారని, కనీసం వాటి మీద నిరసన తెలిపే అవకాశం కూడా తమకి ఇవ్వకుండా ఇళ్లలోనే నిర్బంధించి కేసులు నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ఈ రోజున వైసిపి నాయకుడు అంబటి రాంబాబు అదే ఫ్లెక్సీ దగ్గరకు వచ్చి ప్రెస్ మీట్ లు పెట్టి, 24 గంటలలో వచ్చి తమ ఫ్లెక్స్ చించుతామని చెప్పిన తర్వాత మాత్రమే ఈ సంఘటన జరిగిందని, అయినప్పటికీ తాము ఆ సంఘటన సమర్ధించబోమని అన్నారు. ప్రజాస్వామ్యానికి వైసీపీ వాళ్లు విలువిచ్చిందా లేక కూటమి ప్రభుత్వం విలువిచ్చిందా అనే విషయం ఇక్కడే సుస్పష్టం అర్థమవుతుందని అన్నారు. జనసేన పార్టీ ఎప్పుడూ విలువలతో నడిచే పార్టీ అని, ప్రజాస్వామ్య యుతంగా పరిపాలన సాగాలని ఆకాంక్షించే పార్టీ జనసేన పార్టీ అని, నాయకుడు పవన్ కళ్యాణ్ అని తెలిపారు. అలాగే పోలీసు వ్యవస్థ మరికొంత మెరుగ్గా పనిచేస్తే బాగుండేదని అన్నారు. వైసిపి వాళ్లు చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్ లో ఎవరు పడద్దని అన్నారు. అలాగే జగన్మోహన్ రెడ్డి గుంటూరు పర్యటన మీద స్పందిస్తూ ఆయన పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కూటమి ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు చేపట్టిందని అన్నారు. ఈ విషయాలు అన్ని రాష్ట్ర ప్రజలందరూ గమనించి రాబోయే రోజుల్లో జనసేన పార్టీకి , జనసేన పార్టీ నాయకుడు పవన్ కళ్యాణ్ గారికి అండగా నిలబడాలని కోరారు.

అలాగే రాష్ట్ర కార్యదర్శిలు వడ్రాణం మార్కండేయ బాబు నయూబ్ కమల్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ గారు మచ్చలేని నాయకుడని, ఆయన మీద లేనిపోని నిందలు వేసే ప్రయత్నం వైసిపి వాళ్ళు మానుకోవాలని హితవు పలికారు. నెయ్యి కల్తీ విషయంలో వైసిపి వాళ్ళు చేసింది ముమ్మాటికి తప్పేనని, పూర్తి స్థాయి విచారణ తర్వాత మాత్రమే తమ విషయాన్ని వెల్లడిస్తున్నామని, ఈ విషయం బయటపడితే వైసీపీకి పుట్టగతులు ఉండవు అనే ఆలోచనతో వాళ్ళు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. ఈ ట్రాప్ లో రాష్ట్ర ప్రజలు ఎవరు పడకుండా నిజా నిజాలు తెలుసుకొని కూటమి ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్రాణం మార్కండేయులు బాబు, నాయబ్ కమల్ జిల్లా కమిటీ సభ్యులు, నగర కమిటీ సభ్యులు, వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్లు, నాయకులు, జన సైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

# పెద్దపులి సంచారంపై ప్రజలు ఆందోళన చెందనక్కర్లేదు: మంత్రి కందుల దుర్గేష్

- రాజానగరం సమీపంలో సంచరిస్తున్న పెద్దపులిని పట్టుకునేందుకు అటవీ శాఖ ముమ్మరంగా గాలింపు ప్రయత్నాలు చేస్తోందని వెల్లడి
- బోనులు, ట్రాప్ కెమెరాలు, డ్రోన్లతో అటవీశాఖ అప్రమత్తంగా ఉందని, ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని మంత్రి దుర్గేష్ సూచన
- ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ప్రజల రక్షణే తమ ప్రాధాన్యత అని మంత్రి దుర్గేష్ వెల్లడి



అమరావతి, ( జర్నలిస్ట్ ఫైల్ ) :తూర్పుగోదావరి జిల్లా రాజానగరం సమీపంలో పెద్ద పులి సంచారంపై ఆందోళన అక్కర్లేదని, పులిని బంధించేందుకు అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ట్రాప్, డ్రోన్ కెమెరాలు, బోనులు ఏర్పాటు చేసినట్లు మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు సూచించారు. మంగళవారం కేబినెట్ అనంతరం మంత్రి దుర్గేష్ ఈ విషయమై జిల్లా అటవీ శాఖ అధికారితో ఫోన్ లో మాట్లాడారు. పులి సంచారానికి సంబంధించిన తాజా సమాచారాన్ని అడిగి తెలుసుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. గత కొన్ని రోజులుగా తొర్రేడు, సీతానగరం సమీపంలో పులి సంచరిస్తుందని, దాని ఆనవాళ్లు గుర్తించామని, త్వరలోనే పట్టుకుంటామని అధికారి చెప్పారన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఒకసారి పులి సంచారం చేసిందని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. తగిన జాగ్రత్తలు తీసుకొని త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వెంటనే సంబంధిత ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అటవీ శాఖ పులిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని ఈ సందర్భంగా పెద్దపులి పట్టుబడేంత వరకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లొద్దని, రాత్రి సమయాల్లో పశువుల పాక చుట్టూ ఎక్కువ కాంతినిచ్చే దీపాలు ఏర్పాటు చేసుకోవాలని మంత్రి దుర్గేష్ సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ప్రజల రక్షణే తమ ప్రాధాన్యత అని మంత్రి దుర్గేష్ తెలిపారు. త్వరితగతిన పులిని పట్టుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకున్నట్లు మంత్రి దుర్గేష్ ప్రజలకు భరోసానిచ్చారు.

# జాతీయ అంధత్వనివారణ పథకం ద్వారా విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ

- జాతీయ అంధత్వనివారణ పథకం ద్వారా...రాష్ట్రం లో 94,689 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి వై. సత్యకుమార్ యాదవ్
- తెనాలి నుండి కార్యక్రమం ప్రారంభించడం అభినందనీయం
- మంత్రి నాదెండ్లమనోహర్
- జిల్లాలో 3925 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ
- జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియ




తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):కూటమి ప్రభుత్వ నాయకత్వంలో అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ ప్రజా ఆరోగ్యానికి, విద్య రంగానికి పెద్ద పీట వేస్తోందని బాల్యం నుండి విద్యార్థినీ విద్యార్థులలో అంధత్వ నివారణకు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో జాతీయ అంతత్వ నివారణ కార్యక్రమం ద్వారా కంటి అద్దాల పంపిణీ తెనాలి నుండి ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.

స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య స్కూల్ ప్రాంగణంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే జాతీయ అంధత్వ నివారణ పథకం కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు, వైద్య రంగానికి అటు విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యత క్రమంలో, బాల్యం నుండి పిల్లలు అంధత్వ నివారణకు అడ్డుకట్ట వేసే దిశగా, విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి కంటి అద్దాలు ఉచితంగా అందజేయడం కార్యక్రమ ఉద్యేశ్యం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 94,689 మంది విద్యార్థినీ, విద్యార్థులకు,ఉచిత కంటి అద్దాలు, రాష్ట్రవ్యాప్త పంపిణీ, తెనాలిలో ప్రారంభించు కోవడం ఆనందంగా ఉందన్నారు. అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వ నాయకత్వంలో, ప్రజలకు మెరుగైన సేవలను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయనితద్వారా, ప్రజలకు మంచి జరుగుతుంటే,ప్రతిపక్షం దుష్ప్రచారం చేయడం నేడు చూస్తున్నామన్నారు వైద్యాఆరోగ్య శాఖ ద్వారా, చేపడుతున్న కార్యక్రమాలలో ప్రధానంగా క్యాన్సర్ వ్యాధి నివారణకు ఉచిత స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రకాల క్యాన్సర్లను గుర్తించే పరీక్షలలో, సర్వేకల్ క్యాన్సర్ పరీక్షలకు ప్రజల నుండి ఎదురవుతున్న సమస్యలను వివరించారు. దుష్ప్రచారం చేసే, ప్రతిపక్షం రప్ప, రప్ప దుష్టశక్తులను ప్రజలు తరిమి కొట్టాలన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించే కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమాన్ని తెనాలిలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థిని విద్యార్థులకు బాల్య దశలో, కంటి సమస్యలు ఉన్న ఎవరికి చెప్పుకోలేని పరిస్థితిఅని, ప్రభుత్వం ముందస్తుగా గుర్తించి, బాల్య దశలొకంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు ఇవ్వడం ఓ మంచి కార్యక్రమం అన్నారు. ప్రజా సేవయె పరమావధిగా, సత్య కుమార్ యాదవ్ నిబద్ధతతో, పార్టీకి అంకితమై దేశవ్యాప్తంగా సేవలు అందించారని, కూటమి ప్రభుత్వంలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా, సమర్ధవంతమైన సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు.తెనాలికి ఆయుష్ హాస్టల్ తీసుకురావడంలో ఆయన సహకారం ఎంతో ఉందని, నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతు జాతీయ అంధత్వ నివారణ పథకం ద్వారావిద్యార్థులకు కంటి అద్దాలుపంపిణీ రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని, జిల్లా లొ ప్రారంభించిన మంత్రి వర్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలొ 403 స్కూల్స్ లొ, 51వేల, 781 విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా, 3925 విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. వైద్యాఆరోగ్య శాఖకు జిల్లా తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తెనాలి నియోజకవర్గానికి 398 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ సౌరవ్ గౌర్, జిల్లా బిజెపి అధ్యక్షులు తిరుపతిరావు, జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు పలువురు అధికారులు, స్థానిక ప్రజా పరిధిలో పాల్గొన్నారు.

# వైసీపీ వన్నీ డైవర్షన్ రాజకీయాలే



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): వైసీపీ వన్నీ డైవర్షన్ రాజకీయాలేన ని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ విమర్శించారు. సోమవారం గుంటూరు నగరంలోని కొత్తపేట, శివనగరాజు కాలనీ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ. 2.50 కోట్లతో స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి వెలుగులు తీసుకొచ్చామని అన్నారు. గత ఐదేళ్ల కాలంలో నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి ధ్వంసం చేశారని విమర్శించారు. అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా చేసిన గత ప్రభుత్వ వైఫల్యాలకు ప్రజలే సాక్ష్యమన్నారు. యూజీడీ పనులను పక్కన పడేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కనీసం పాదచారులు కూడా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి ప్రాంతాన్ని వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గుంటూరు నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించారని గుర్తు చేశారు. ఇరవై ఏళ్లుగా విస్తరణ లేక ఇబ్బందులు పడుతున్న మొండిగేటు సమస్య పరిష్కారానికి రైల్వే అధికారులతో చర్చించి రూ. 8 కోట్ల నిధులు విడుదల చేయించామని తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. పాత గుంటూరు ప్రాంతాన్ని అభివృద్ధిలో కొత్త రూపు తీసుకొస్తున్నామని, అదే సమయంలో ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే ముఖ్యమంత్రి లక్ష్యానికి అనుగుణంగా యువతను చైతన్యం చేస్తున్నామని నసీర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ దేగల ప్రభాకర్, కార్పొరేటర్ పోతుల సమత, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చలో ఢిల్లీ - పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయాలి

- ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయులకు ఆప్టా పిలుపు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత ఉపాధ్యాయ సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న నిర్వహించనున్న "చలో ఢిల్లీ – పార్లమెంట్ మార్చ్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయులకు ఆప్టా నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కె. ప్రకాష్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. జి. మెహది, అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎ. జి. ఎస్. గణపతి రావు మాట్లాడుతూ -- అఖిల భారత ఉపాధ్యాయ జెఏసి పిలుపు మేరకు దేశం నలుమూలల నుంచి వేలాది మంది ఉపాధ్యాయులు ఢిల్లీకి తరలివస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా భారీగా పాల్గొని సంఘీభావం చాటాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రధానంగా మూడు కీలక డిమాండ్లు ముందుకు తీసుకువస్తున్నామని తెలిపారు. సేవలో ఉన్న ఉపాధ్యాయులకు అర్హత పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రాథమిక ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఆప్టాతో పాటు యుటిఎఫ్, ఎస్టీయూ, పిఆర్టీయూ, ఎపిటిఎఫ్ వంటి వివిధ ఉపాధ్యాయ సంఘాలు కూడా భాగస్వాములవుతున్నాయని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై ఐక్యంగా పోరాడే శక్తిని ఈ ఉద్యమం ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయునిపైనే ఉందని, ప్రతి ఒక్కరూ పాల్గొని తమ హక్కుల కోసం గొంతెత్తాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కె. ప్రకాష్ రావు పిలుపునిచ్చారు.

# మున్సిపల్ ఉపాధ్యాయులకు భవిష్యనిధి సౌకర్యం కల్పించాలి



- పాఠశాల విద్యా కమిషనర్‌కు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ వినతి

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో పనిచేస్తున్న మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయులకు భవిష్య నిధి లేదా కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం సౌకర్యం వెంటనే కల్పించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు కోరారు. ఈ మేరకు గురువారం పాఠశాల విద్యా కమిషనర్ కె. విజయరామరాజుకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2022లో మున్సిపల్ ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి తీసుకువచ్చినా, అప్పటి నుంచి ఉపాధ్యాయుల జీతాల నుంచి భవిష్య నిధి కోతలు జరగడం లేదని తెలిపారు. ఇది ప్రభుత్వ సేవా నిబంధనలకు విరుద్ధమని, ప్రతి ఉద్యోగికి భవిష్య నిధి లేదా కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం తప్పనిసరి కావాలని పేర్కొన్నారు. ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

అలాగే రాష్ట్రంలో ఉన్న సుమారు నాలుగు వందల మంది శారీరక విద్య ఉపాధ్యాయులకు విద్యార్హత పెంపు కోసం వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అర్హత గల ద్వితీయ శ్రేణి ఉపాధ్యాయులకు పాఠశాల సహాయ ఉపాధ్యాయులుగా (తెలుగు, హిందీ) పదోన్నతులు కల్పించాలని, మండల విద్యాధికారుల బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఇతర సమస్యలను కూడా కమిషనర్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.

ఈ వినతి కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు జె. శ్రీనివాసరావు, వి. జయప్రకాష్ నాయుడు, టి. వెంకటరమణ, కె. సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# 'నక్ష' పైలట్ ప్రాజెక్టుకు గుంటూరు జిల్లా ఎంపికపై బీజేపీ హర్షం

- కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు కృతజ్ఞతలు



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జి ఆధారిత ల్యాండ్ సర్వే ఆఫ్ హ్యాబిటేషన్ (నక్ష) కార్యక్రమానికి పైలట్ ప్రాజెక్టుగా గుంటూరు జిల్లాలోని మంగళగిరి--తాడేపల్లి నగరపాలక సంస్థను ఎంపిక చేయడంపై బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా కేంద్ర రైల్వే బడ్జెట్‌లో గుంటూరు డివిజన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడంపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ, డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడర్నైజేషన్ ప్రోగ్రామ్ కింద కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఈ సర్వే ద్వారా భవిష్యత్తులో ఆస్తుల వివాదాలకు చెక్ పడుతుందని అన్నారు. భూమి, ఇళ్లకు సంబంధించిన పూర్తి వివరాలను డిజిటలైజేషన్ ద్వారా ప్రజలకు సులభంగా అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం లక్ష్యమని వివరించారు.

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్ ఆధ్వర్యంలో మంగళగిరి––తాడేపల్లి నగరపాలక సంస్థను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, తాడేపల్లిలోని ఆంధ్రరత్న కట్ట ప్రాంతం, మంగళగిరిలోని కొప్పురావు కాలనీలో రీసర్వే ప్రారంభించినట్లు తెలిపారు. పైలట్ ఫలితాలను విశ్లేషించి నగరమంతా సర్వే చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం భూములు, ఇళ్లకు సంబంధించిన వివరాల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోందని, ఈ సర్వే పూర్తైతే క్యూఆర్ కోడ్, విశిష్ట సంఖ్యతో కూడిన ప్రాపర్టీ కార్డు జారీ చేస్తారని చెప్పారు. ఆ కార్డును స్కాన్ చేస్తే యజమాని వివరాలు, నిర్మాణ స్థలం విస్తీర్ణం, భవన విస్తీర్ణం తదితర సమాచారం వెంటనే లభిస్తుందని తెలిపారు.

ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు గుంటూరు జిల్లాకు ప్రాధాన్యత కల్పించినందుకు హర్షం వ్యక్తం చేసిన తిరుపతిరావు, రైల్వే బడ్జెట్‌లో గుంటూరు డివిజన్ అభివృద్ధికి కేటాయింపులు పెరగడం జిల్లాకు మేలు చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న అభివృద్ధి చర్యలతో గుంటూరు జిల్లా మరింత ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో హైడ్రోజన్ విప్లవానికి శ్రీకారం

- ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ - జె.కె. శ్రీవాస్తవ హైన్రాఫ్ మధ్య చారిత్రక ఒప్పందం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగు పడింది. ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ–ఆంధ్రప్రదేశ్ మరియు ఇండో––పోలిష్ సంయుక్త సంస్థ జె.కె. శ్రీవాస్తవ హైన్రాఫ్ పి.ఎస్.ఏ. లిమిటెడ్ మధ్య మంగళవారం విజయవాడలోని లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్‌లో అవగాహన ఒప్పందం కుదిరింది. హైడ్రోజన్ సాంకేతికతల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా "సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటు చేయడం ఈ ఒప్పంద ప్రధాన ఉద్దేశ్యం. ఈ సందర్భంగా ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రీసెర్చ్) ప్రొఫెసర్ డి. నారాయణరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాల మేరకు రాష్ట్రంలో ఏర్పాటు కానున్న గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలో యూనివర్సిటీ కీలక పాత్ర పోషించబోతోందని తెలిపారు. కొత్తగా ఏర్పాటయ్యే సెంటర్ ద్వారా స్వదేశీ సాంకేతికతతో ఎలక్ట్రోలైజర్ల తయారీ, హైడ్రోజన్ నిల్వ సామర్థ్యం పెంపు, హైడ్రోజన్ ఆధారిత విమానాల కోసం రీఫ్యూయలింగ్ స్టేషన్ల రూపకల్పన వంటి అంశాలపై పరిశోధనలు జరుగుతాయని చెప్పారు.

**మూలపేటలో భారీ ప్రాజెక్టు :** శ్రీకాకుళం జిల్లా మూలపేట వద్ద ఏడాదికి 5 లక్షల మెట్రిక్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసే భారీ ప్లాంట్‌కు మార్చి 18న ఉగాది సందర్భంగా శంకుస్థాపన జరగనుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 282 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు.

**పరిశ్రమకు సిద్ధమైన మానవ వనరులు:** ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఈ ఒప్పందం ద్వారా కృత్రిమ మేధస్సు, క్వాంటం కంప్యూటింగ్, హైడ్రోజన్ సాంకేతికత వంటి ఆధునిక విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తామని తెలిపారు. విదేశీ సాంకేతికత ఖరీదైనదని, తక్కువ ఖర్చుతో కూడిన స్వదేశీ సాంకేతికత అభివృద్ధే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

**అంతర్జాతీయ ఎగుమతులే లక్ష్యం:** జె.కె. శ్రీవాస్తవ హైన్రాఫ్ సంస్థ వ్యవస్థాపకుడు, చైర్మన్ జె.కె. శ్రీవాస్తవ మాట్లాడుతూ, తమకు ఉన్న 27 ఏళ్ల అనుభవంతో ఆంధ్రప్రదేశ్‌ను హైడ్రోజన్ హబ్‌గా మార్చుతామని అన్నారు. 2028 ఆగస్టు 15 నాటికి తొలి గ్రీన్ అమ్మోనియా షిప్‌మెంట్‌ను యూరప్‌కు ఎగుమతి చేయాలన్న ముఖ్యమంత్రి లక్ష్యానికి అనుగుణంగా తమ ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇది ఐటీ విప్లవం తర్వాత దేశంలో రాబోయే అతిపెద్ద మార్పు అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**లక్ష కోట్ల పెట్టుబడులు - లక్షలాది ఉద్యోగాలు**




నెడ్‌క్యాప్ వైస్ చైర్మన్ , ఎండీ ఎం. కమలాకర్ బాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర శుభ్ర శక్తి విధానంతో 2029–30 నాటికి రూ. 7.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, 10 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఈ రంగంలో పెట్టుబడులకు ప్రభుత్వం 25 శాతం మూలధన సబ్సిడీ వంటి ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు.

ఈ ఒప్పంద కార్యక్రమంలో జె.కె. శ్రీవాస్తవ హైన్రాఫ్ డైరెక్టర్లు పంకజ్ శ్రీవాత్సవ, ఆర్థర్ కోలాకోవస్కి, పావల్ ట్రోజనోవస్కీ, ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. ప్రేమ్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మారం పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 5న టెట్ మినహాయింపునకై ఛలో ఢిల్లీ జయప్రదం చేయండి: ఏపీటీఎఫ్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఏఐజెఏసిటిఓ) ఆధ్వర్యంలో ఇన్ సర్వీస్ టీచర్స్ కు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీలో చేపట్టే పార్లమెంట్ మార్చ్ ను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, యస్.చిరంజీవి ఒక ప్రకటనలో ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో అనుభవం ఉన్న ఇన్ సర్వీస్ టీచర్లకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) 30/25 సం ల తర్వాత నిర్వహించడం అసంబద్ధమని , ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయింపు ఇస్తూ ప్రస్తుతం జరిగే పార్లమెంట్ సమావేశాల్లో సవరణ బిల్లు తేవాలని కోరారు. అదేవిధంగా సిపిఎస్ మరియు యుపిఎస్ లను రద్దుచేసి పాత పెన్షన్ (ఓ పి ఎస్) విధానాన్ని పునరుద్ధరించాలని, విద్యా విధానాన్ని తిరోగమనం వైపు నడిపిస్తున్న 2020 నూతన జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని కోరారు. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్నారనే కారణంతో పాఠశాలలను మూసివేయాలనే విధానానికి స్వస్తి పలకాలని వారు కోరారు. ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసే బోధనేతర పనులను రద్దుచేసి పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను కల్పించాలని అలాగే కాంట్రాక్టు ఉద్యోగుల, ఉపాధ్యాయుల సర్వీసును క్రమబద్ధీకరించాలనే తదితర ప్రధాన సమస్యల సాధనకై ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీలో చేపట్టే పార్లమెంట్ మార్చ్ ను జయప్రదం చేయాలని వారు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

# ప్రధాని మోదీ దార్శనికతతో... దేశంలోనే అభివృద్ధి మోడల్‌గా ఆంధ్రప్రదేశ్

- బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): "సబ్‌కా సాత్ – సబ్‌కా వికాస్" సూత్రంతో దేశ సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర బడ్జెట్ 2026–27లో ఆంధ్రప్రదేశ్‌కు లభించిన ప్రాధాన్యత రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు సమాధానంగా నిలుస్తుందని రాష్ట్ర బీజేపీ అభిప్రాయపడింది. కేంద్ర బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్‌కు స్పష్టమైన ప్రాధాన్యత ఇవ్వడంపై ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర బీజేపీ ధన్యవాదాలు తెలిపింది.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, ఆ పార్టీ మీడియా విభాగం రాష్ట్ర ఇన్‌చార్జితో కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ, ప్రధాని మోదీ దార్శనికతతో రూపొందిన ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌ను వ్యూహాత్మక అభివృద్ధి రాష్ట్రంగా గుర్తించడం చారిత్రక పరిణామమని తెలిపారు. రాష్ట్రాన్ని పరిశ్రమలు, డిజిటల్ టెక్నాలజీ, మౌలిక సదుపాయాల కేంద్రంగా తీర్చిదిద్దడమే మోదీ లక్ష్యమని స్పష్టం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల అభివృద్ధి వేగం పెరిగిందని, రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అభివృద్ధి మోడల్‌గా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి రంగంలోనూ రాష్ట్రానికి నిధుల కేటాయింపులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. "డబుల్ ఇంజిన్ సర్కార్" వల్ల రాష్ట్ర ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, రాబోయే కాలంలో సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోందని తెలిపారు. యూనియన్ బడ్జెట్ 2026–27లో ఆంధ్రప్రదేశ్‌ను వ్యూహాత్మక అభివృద్ధి రాష్ట్రంగా కేంద్రం గుర్తించడం రాష్ట్రానికి గేమ్‌చేంజర్‌గా మారుతుందని అన్నారు.

**రాష్ట్రంలో రైల్వే విప్లవానికి నాంది:** ఈ బడ్జెట్‌లో రైల్వే రంగానికి రికార్డు స్థాయిలో నిధులు కేటాయించడంతో పాటు హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, చెన్నై–బెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్లు ఆంధ్రప్రదేశ్ మీదుగా రావడం వల్ల రాష్ట్రం దక్షిణ భారతదేశపు ట్రాన్సిట్ హబ్‌గా మారుతుందని చెప్పారు. ఇది పరిశ్రమలు, ఉపాధి, పెట్టుబడులకు భారీ బలంగా నిలుస్తుందని తెలిపారు.

**పరిశ్రమల పునరుజ్జీవనం:** ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, రేర్ ఎర్త్ కారిడార్లు, రూ. 10,000 కోట్ల ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్, రూ. 10,000 కోట్ల కంటైనర్ మాన్యుఫ్యాక్చరింగ్ పథకం వంటి నిర్ణయాలు ఆంధ్రప్రదేశ్‌లో హై–వాల్యూ ఉద్యోగాలను సృష్టించడంతో పాటు స్థానిక యువతకు అవకాశాలు కల్పిస్తాయని అన్నారు. 2047 వరకు డేటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడే ఇవ్వడంతో విశాఖలో ఏర్పాటైన ఏఐ హబ్ మరింత విస్తరించి, రాష్ట్రాన్ని గ్లోబల్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గమ్యస్థానంగా మార్చే చారిత్రక నిర్ణయంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**రైతులు, మత్స్యకారులకు భరోసా:** కొబ్బరి, జీడిపప్పు, కోకో పంటలను గ్లోబల్ బ్రాండ్లుగా మార్చే ప్రణాళికలు, 500 రిజర్వాయర్ల అభివృద్ధి, డెయిరీ––పౌల్ట్రీ రంగాలకు క్రెడిట్ లింక్డ్ సదుపాయాలు రైతుల ఆదాయం పెంచే దిశగా ఉపయోగపడతాయని చెప్పారు. ఈఈజెడ్‌లో డీప్ సీ ఫిషింగ్‌కు డ్యూటీ ఫ్రీ సదుపాయం, విదేశీ పోర్టుల్లో దిగుమతులను ఎగుమతులుగా పరిగణించడం, కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్, మార్కెట్ యాక్సెస్ వంటి చర్యలు ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ ఫిషరీస్ హబ్‌గా మార్చనున్నాయని తెలిపారు.

**మహిళలు, సంప్రదాయ వృత్తులకు ప్రోత్సాహం:** రాష్ట్రంలో 14.87 లక్షల లఖపతి దీదీలు ఉండటం గర్వకారణమని, షీ మార్ట్స్ ద్వారా మహిళలు వ్యాపార యజమానులుగా మారే అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో బాలికల హాస్టళ్ల ఏర్పాటు, ధర్మవరం, పొందూరు, పెదన, మంగళగిరి చేనేత కేంద్రాల ఆధునీకరణ, సామర్థ్ 2.0 ద్వారా "ఫామ్ టు ఫైబర్" విలువ శృంఖల బలోపేతం చేయడం సంప్రదాయ వృత్తులకు ఆధునిక మార్కెట్‌ను తెస్తుందని అన్నారు.

**పర్యాటకం - నేచర్ & హెల్త్ టూరిజం హబ్‌గా ఆంధ్రప్రదేశ్:** అరకు ట్రెక్కింగ్ ట్రైల్స్, పులికాట్ బర్డ్ వాచింగ్, మెడికల్ ఁ ఆయుష్ టూరిజం వంటి కార్యక్రమాలు రాష్ట్రాన్ని నేచర్ ం హెల్త్ టూరిజం హబ్‌గా నిలబెట్టనున్నాయని చెప్పారు. అలాగే, 2026--27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు కేటాయించిన రూ. 1.4 లక్షల కోట్లలో ఆంధ్రప్రదేశ్‌కు న్యాయమైన వాటా లభించడం గ్రామీణాభివృద్ధి, పట్టణ పాలన, విపత్తు నిర్వహణకు కీలకమని అన్నారు. ఈ బడ్జెట్ రాజకీయ నినాదాల కోసం కాదు, రాష్ట్రానికి బలమైన ఆర్థిక పునాది వేయడానికేనని జయప్రకాష్ స్పష్టం చేశారు. ఇది భవిష్యత్తును నిర్మించే, ఆంధ్రప్రదేశ్‌కు స్పష్టమైన దిశ చూపించే బడ్జెట్‌గా నిలుస్తుందని అన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467